ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్
fb.com/vaartha Digital

నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు 3
చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుఫాన్ 5

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 191 పేజీలు: 8+16 వెల: 6.50

ఇక అంతరిక్షంలో
# వ్యవసాయం!
## వరి పంట పండించి కోత కోసిన చైనా
## చంద్రుడు, అంగారకుడిపై ధాన్యం సాగు




**హైదరాబాద్, అగస్టు 9, ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో అంతరిక్ష కేంద్రాల్లోనే పంటలు పండించి, వ్యోమగాములు అక్కడే భోజనం తయారు చేసుకునే రోజులు రాబోతున్నాయి. ఇందుకు ఊతమిచ్చేలా చైనా చేపట్టిన ప్రయోగం విజయవంతం అయింది. భూమికి వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న చైనా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు వరి పంటను తొలిసారి విజయవంతంగా పండించారు. విత్తనం వేసి ధాన్యాన్ని నూర్పే వరకు జీవిత చక్రాన్ని పూర్తిచేసి ప్రతిష్ఠాత్మక మైలురాయిని దాటారు. చైనా చేపట్టిన షెంజౌ23 మిషన్‌లో భాగంగా మే 24న వరి విత్తనాలను టియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు నెలలకు పైగా సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో వాటిని పెంచిన అనంతరం వ్యోమగాములు జూ యాంగ్జు, జాంగ్ >>2



# 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి
## దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నాడు పౌరులకు ఒక పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకాన్ని "గర్వకారణం", "స్ఫూర్తిదాయకం"గా అభివర్ణిస్తూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ ఏడాది ఈ >>2

# వానల కోసం..
## నాగార్జున సాగర్‌లో నేడు వరుణ యాగం
## 108 మంది రుత్విక్కులతో భారీ క్రతువు
## పాల్గొననున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పం
'సాగర్'లో ఇంకా 166.39 టిఎంసిలు ఖాళీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు9:** నైరుతి రుతుపవనాల కాలం సగం దాటి ఆగస్టు రెండో వారంలోకి ప్రవేశించినా తెలంగాణకు జీవనాడులైన కృష్ణా, గోదావరి నదులకు స్థిరమైన ప్రవాహాలు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు.రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాలంటే తెలంగాణలో వర్షాలతోపాటు ఎగువనఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా-గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని ఆకాంక్షిస్తూ సోమవారం నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈ యాగంలో పాల్గొననుండగా, నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు. తెలంగాణతోపాటు కృష్ణా, గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా, సకాలంలో వర్షాలు కురవాలని, నదులకు స్థిరమైన ప్రవాహాలు రావాలని, జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందాలని కోరుతూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులు, ఆలయ సిద్ధాంతితో సంప్రదింపుల అనంతరం సోమవారం(ఆగస్టు 10న)వరుణయాగం నిర్వహించేందుకు ముహూర్తంనిర్ణయించారు. నాగార్జున సాగర్‌లోని విజయవిహార్ ప్రాంగణంలో 11 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు. 108 మంది రుత్వికులు, అర్చకులు, >>2

నీట్ లీకేజీలపై తొలిసారి గళం విప్పిన కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టేది యువతే 5

## 'జెన్‌జెడ్'ను తప్పుదారి పట్టించారు..



## అంగరంగ వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు 6



ఆదివారం పాతబస్తీలో లాల్‌దర్వాజా అమ్మవారికి బోనం సమర్పించిన మంత్రులు కొండా, పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ తదితరులు

73 లక్షలు పైగా
# ఓట్లు గల్లంతు?



## తెలంగాణలో నేటితో ముగియనున్న 'సర్' ప్రక్రియ
## 3.38 కోట్ల ఓటర్లతో 78.14% డిజిటైజేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు9:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ సోమవారం (ఆగస్టు10)తో ముగియనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ చేశారు. ఇంకా 73లక్షల 95వేల 954 ఓటర్ల ఎన్యుమరేషన్ల ఫారాలు డిజిటలైజేషన్ కావాల్సి ఉంది. సోమవారం ఒక్క రోజులో ఒక్క శాతంకు మంచి డిజిటలైజేషన్ అవకాశం లేదని తెలుస్తోంది. కాగా, ఇప్పటి వరకు జరిగిన డిజిటలైజేషన్‌లో హైదరాబాద్ 58.58 శాతంతో చివరి స్థానంలో ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి 63.82 శాతం, రంగారెడ్డి 64.91 శాతం నమోదయ్యాయి. అత్యధిక డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి 94.30 శాతంతో తొలి స్థానంలో ఉంది. మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్‌లో 89.45 శాతం, జగిత్యాలలో 89.60 శాతం పూర్తి అయింది. రెండుసార్లు గడువు పొడిగించిన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పెరగలేదు,శనివారం సాయంత్రం వరకు నమోదైన లెక్కల ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల్లో 28 నియోజకవర్గాల్లో ఇప్పటికే 1.14 కోట్ల ఓటర్లు ఉన్నారు. వారిలో 40 లక్షల ఓట్లు గల్లంతు కానున్నట్లు అంచనా వేస్తున్నారు, క్యూర్ పరిరిధిలోని చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో రద్దయ్యే ఓట్లను మినహాయించాలి. మిగిలిన 25 నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నంలో 21.43 శాతం, బహదూర్‌పురలో 22.38 శాతం ఓట్లు అత్యల్పంగా రద్దు కానున్నాయని అంచనా. అయితే సనత్‌నగర్ నియోజకవర్గం విషయానికొస్తే అక్కడ మొత్తం 2,54,030 ఓట్లు ఉన్నాయి. వాటిలో 1.16 లక్షల ఓట్లు అంటే 45.68 శాతం ఓట్లు రద్దు కాబోతున్నాయని సమాచారం. క్యూర్ పరిధిలో బోనాల పండుగ ఉండటం వల్ల ఎక్కువ మొత్తంలో హెచ్చుతగ్గులు ఉండవని అధికారులు అంచనా వేస్తున్నారు. మలక్‌పేట్ >>2



ఆదివారం నల్లబెల్లిలో పెద్ది కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న కెసిఆర్

'పెద్ది' కుటుంబానికి
# కెసిఆర్ భరోసా
## రూ.2.25 కోట్ల సాయం అందించిన మాజీ సిఎం
## తెలంగాణ ఉద్యమాన్ని పెద్ది ముందుండి నడిపించాడంటూ పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకున్న కెసిఆర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో / నల్లబెల్లి, ఆగస్టు 9:** ఇటీవల మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ స్వయంగా 2.25 కోట్ల రూపాయల చెక్ అందజేశారు.అదివారం పెద్ది నల్లబెల్లి మండల కేంద్రం లో ఇంటికి కేసీఆర్ స్వయంగా వెళ్లి పెద్ది కుటుంబానికి భరోసా ఇచ్చారు. దాదాపు 45 నిమిషాలు ఆయన ఇంటిలోనే ఉన్నారు. పెద్ది తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నాయకుడు అని, పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు.పెద్ది సుదర్శన్రెడ్డి స్వగృహంలో దశదిన కార్య క్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులు భార్య స్వప్న, తల్లి అమృతమ్మను >>2

# ప్రియాంక మృతి
## మృత్యువుతో పోరాడి ఓడిన మెడికో
## రాజమండ్రిలో కొందరు మద్యం మత్తులో కారుతో ఢీకొన్న ఘటన..
## హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త:** అభంశుభం తెలియని ఓ యువ వైద్యురాలు దుర్మార్గపు దుశ్చర్యకు బలైంది. మద్యం మత్తులో ఇరువురు యువకులు కారుతో ఢీ కొట్టి ఆమె ఉసురు తీసుకున్నారు. తీవ్ర గాయాలతో సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రియాంక. బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించిన వైద్యులు. ఏడు రోజులు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచింది. ఆ కుటుంబం, తల్లిదండ్రుల ఆశలు అర్థాంతరంగా ముగిసిపోయాయి.ఏ విధంగానూ సంబంధం లేని వైద్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించి మూడుసార్లు కారుతో ఢీకొట్టిన ఆ మత్తు దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. ఈ నెలమూడవ తేదీన రాజమండ్రిలో కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందారు. ఏడు రోజులుగా వైద్యం అందిస్తున్నా ఫలితం లేకపోయింది. ప్రమాదం జరిగిన రోజునే ప్రియాంక బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ప్రసాదిత్య మాల్‌వద్ద మద్యంమత్తులో ఇద్దరు యువకులు స్కూటీని వెనకరించి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి కూడా ఢీకొట్టడంతో కిందపడ్డ ప్రియాంక తీవ్రంగా గాయపడింది. ప్రియాంక >>2



## భారత్ చట్టాలను పాటించాల్సిందే
### మెటాకు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** మెటా ప్లాట్‌ఫారమ్‌లు భారత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదివారం స్పష్టం చేసినట్లు సమాచారం. సోషల్ మీడియా దిగ్గజంతో ఇటీవల జరిగిన చర్చల ముఖ్య ఉద్దేశ్యం, కేవలం ఆ సంస్థ ప్రపంచ ప్రమాణాలను అనుసరించడం కాదని, దాని విధానాలు, కంటెంట్ నియంత్రణ పద్ధతులు దేశ >>2

## సుప్రీం సిజెఐ రావొద్దు
### నల్సార్ విద్యార్థుల నిరసన
### 450 మంది సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్‌లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై >>2



ఆదివారం పట్టుకున్న డ్రగ్స్, నిందితులతో బీబీనగర్ పోలీసులు

# రూ.54 కోట్ల డ్రగ్ దందా గుట్టురట్టు!
## కొండమడుగులో మెఫెడ్రోన్ తయారీ..
## నాగ్‌పూర్‌కు తరలిస్తుండగా పట్టివేత
## 27 కిలోల మాదకద్రవ్యం స్వాధీనం..
## నలుగురి అరెస్టు, మరో నలుగురి కోసం గాలింపు

**యాదాద్రిభువనగిరి బ్యూరో ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో డ్రగ్స్ మాఫియా గుట్టురట్టయింది. కొండమడుగు గ్రామ శివారులోని వేటుకూరి ల్యాబ్స్‌లో మెఫెడ్రోన్ తయారు చేసి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన భారీ దందాను యాదాద్రిభువనగిరి పోలీసులు ఛేదించారు. బీబీనగర్ పోలీసులు, ఎస్‌వోటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. డ్రగ్ తయారీలో ఉపయోగించే సుమారు 40 కిలోల అసిటోన్ లిక్విడ్, ఆరు సెల్‌ఫోన్లు, ఎం ఎచ్ 49 సి డబ్ల్యూ1313 నంబర్ గల ఫార్చ్యూనర్ కారుతో పాటు ల్యాబ్‌లోని రియాక్టర్, సెంట్రిఫ్యూజ్, ఇతర >>2



## వేజ్‌బోర్డు అమలు కోసం నేడు బొగ్గు గనుల్లో దేశ వ్యాప్త ఆందోళన

**హైదరాబాద్, అగస్టు 9, ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న బొగ్గు గని కార్మికులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే 12 వేజ్‌బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న దేశ వ్యాప్తంగా అన్నీ బొగ్గు గనుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జాతీయ సంఘాల నాయకులు ప్రకటించారు. హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో >>2



ఆదివారం గువాహటిలో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో మరపడవల్లో ప్రజలను తరలిస్తున్న అధికారులు

## 'పెద్ది' కుటుంబానికి కెసిఆర్‌భరోసా

>> పరామర్శించి పెద్ది చిత్ర పటానికి నివాళులు అర్పించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావడంతో మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి అమరి నినాదంతో నల్లబెల్లి గ్రామం మారుమోగింది. మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సిఎం కెసిఆర్ రావడంతో నర్సంపేట నియోజక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైనారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మాజీ సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల అత్యుత్సాహంతో పోలీసుల వైఫల్యంతో 30 నిమిషాల పాటు కెసిఆర్ కారులోనే ఉండి పోయారు సిఎం కెసిఆర్ అభిమానులు అధికంగా రావడంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వ్యవహరించినట్లు బిఆర్ఎస్ పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కైన మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబాన్ని కెసిఆర్ ఓదార్చి ధైర్యం చెప్పారు నర్సంపేట నియోజక వర్గ ప్రజలు, పెద్ది సుదర్శన్ రెడ్డి అభిమానులు అధైర్య పడవద్దని తెలిపారు. కష్టకాలంలో బిఆర్ఎస్ పార్టీని ఆదుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని, నియోజక వర్గ ప్రజలను ఆదుకుంటానని తెలిపారు. సహచరా ఉద్యమ కారున్ని కోల్పోయాను, ఎప్పుడు కెసిఆర్ వెంట ఉండేవారని తెలంగాణ ఉద్యమంలో ప్రాణంగా ప్రేమించే వారని ఆంధ్ర పార్టీలకు బెదరకుండా ఉద్యమం కొనసాగించారని కెసిఆర్ వెల్లడించారు. కెసిఆర్ కు నమ్మిన బంటుగా నమ్మిన సిద్దాంతం కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి పని చేసే వారని, పెద్ది భౌతికంగా మన మధ్య లేకపోయిన ఆయన ఆశయాలకు కార్యకర్తలు తో పాటు పదలని సూచించారు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో తనకు తానుగా ఉద్యమాన్ని మలుచుకున్నా రని ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమం ఉన్నది అంటే అది పెద్దితోనే మొదలయ్యేదని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఇద్దరు పిల్లలు కుమారుడు సుదర్శన్‌రెడ్డి, కుతూరు ధర్మిష్టరెడ్డిలకు వేరో కోటి చొప్పున తల్లికి 26 లక్షల ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించి చెక్కును అందించారు. నల్లబెల్లి గ్రామంలో కెసిఆర్ రాకతో వెయ్యి నుండి 1500 కార్లతో కిక్కిరిసి పోయింది. మాజీ సిఎం కెసిఆర్ వెంట జనగామ ఎంఎల్‌ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి,రాజ్యసభసభ్యులు వద్దిరాజ్ రవిచంద్ర, మాజీ మాత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, బండా ప్రకాష్, మాజీ స్పీకర్, శాసనమండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూధనచారి, టి. జీవన్‌రెడ్డి, పాడి కౌశిక్రి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్కుమార్, మాజీ గిడ్డంగుల చైర్మన్ దివంగత సాయిచంద్ భార్య రజిని, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంఎల్ఎలు అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, గంగుల కమాలకర్, తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్షంలో వ్యవసాయం!

>> జియువాన్, లై క్రైయింగ్ తొలి వరి నమూనాలను సేకరించారు. అంతరిక్ష ఇక్యూబేటర్లలో ప్రత్యేక ఎల్ఈడీ కాంతి, ద్రవ పోషకాల ద్వారా నీరు, ఎరువులను అందించి వరి పంట పండించారు. సాధారణంగా భూమిపై గురుత్వాకర్షణ ప్రభావంతో మొక్కల వేళ్లు కిందికి, కాండం పైకి పెరుగుతాయి. అయితే, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (శూన్య గురుత్వాకర్షణ శక్తి)లో వాతావరణంలో మొక్కల పెరుగుదల శైలి మారినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. చైనా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో రెండు రకాల జపోనికా వరి విత్తనాలను ఉపయోగించారు. ఒకటి అంతరిక్షానికి ఎప్పుడూ వెళ్లని సాధారణ విత్తనాలు కాగా, మరొకటి 2022లో టియాంగాంగ్‌లో పండించిన వరి నుంచి వచ్చిన విత్తనాలు. అంతరిక్ష వాతావరణానికి గతంలో అలవాటు పడిన విత్తనాలు తరువాతి తరాల్లో ఎలా స్పందిస్తాయో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. 2022లో చైనా అంతరిక్షంలో తొలిసారిగా వరి పూర్తి జీవచక్ర ప్రయోగాన్ని నిర్వహించింది. ఆ సమయంలో ఆరు వరి విత్తనాలను 120 రోజులపాటు కక్ష్యలో పెంచగా, 59 కొత్త విత్తనాలు లభించాయి. వాటిని భూమికి తీసుకువచ్చి తదుపరి పరిశోధనలు చేశారు. తాజా సంచలన ప్రయోగం ద్వారా రోదసీలోనే ఆహారాన్ని పండించటమే కాకుండా, వ్యోమగాములు విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ ను విడుదల చేయటానికి కూడా అవకాశం దొరికింది. నీటి వ్యవస్థ సహజ సిద్ధంగా శుద్ధి చేయటం కూడా సాధ్యమవుతుంది. అంతరిక్షంలో క్లోజ్డ్ లూప్ ఎకో సిస్టమ్ రూపుదిద్దుకోవడానికి ఇది ప్రాథమిక అడుగుగా భావిస్తున్నారు. భవిష్యత్తులో మార్స్, చంద్రుడిపై కాలనీలు నిర్మించే క్రమంలో భూమి నుంచి ప్రతీసారి ఆహారాన్ని మోసుకెళ్లే అవసరం లేకుండా, అక్కడే స్వయం పంటలు పండించేందుకు ఇక మీదట 100 శాతం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాదు.. ఈ అంతరిక్ష వరి విత్తనాల్లోని జన్యుపరమైన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా భూమిపై తీవ్ర ప్రతికూల వాతావరణ మార్పులను ఎదుర్కొనే నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి కూడా ఈ పరిశోధన దోహదపడుతుందని చెబుతున్నారు.

## 73 లక్షలు పైగా ఓట్లుగల్లంతు?

>> 33.92శాతం, సనత్‌నగర్ 45.68శాతం, ముషీరాబాద్ శాతం, జూబ్లిహిల్స్ 44.21శాతం, అంబర్‌పేట్ 36.17శాతం, గోషామహల్ 39.38శాతం, ఖైరతాబాద్36.78శాతం, సికింద్రాబాద్ 38.47శాతం, కార్వాన్ 33.23శాతం, చార్మినార్ 32.49శాతం, నాంపల్లి 31.33శాతం, బహదూర్‌పుర 22.38శాతం, కంటోన్మెంట్‌లో35.31శాతం, యాఖుత్‌పుర 31.40శాతం, చాంద్రాయణగుట్ట 32.57 ాతం. ఇబ్రహీంపట్నం 21.43శాతం, ఎల్బీనగర్ 42.19శాతం, మహేశ్వరం 40.03శాతం, రాజేంద్రనగర్ 38.14శాతం, శేరిలింగంపల్లి 36.60శాతం, చేవెళ్ల 19.31శాతం, కల్వకుర్తి 11.65శాతం, షాద్‌నగర్ 14.56 శాతం రద్దు కానున్నాయి. మేడ్చల్ 29.30, మల్కాజిగిరి 37.30, కుత్బుల్లాపూర్ 35.99, కూకట్‌పల్లి 32.81, ఉప్పల్‌లో 40.05 శాతం ఓట్లు రద్దు కానున్నాయి. ఆది,సోమవారాల్లో ప్రభుత్వ సెలవు అయినప్పటికీ బీఎల్‌వోలు , అలాగే ఉన్నతాధికారులు విధులకు హాజరవుతున్నారు. మరోవైపు ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బోనాలు పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు9:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శక్తి స్వరూపిణి, లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి కరుణాక టాక్షాలు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఐకమత్యంతో, సౌభాగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారినికొలుస్తూ, మనసంస్కృతి, సంప్రదాయాల వైభవాన్నిచాటుతూ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

## సుప్రీం సిజెఐ రావొద్దు..

>> సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భం గా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిర సనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

### వారం - వర్జ్యం

10-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ద్వాదశి రా.8.01, తి.త్రయోదశి తె.4.54
న.ఆరుద్ర మ.12.27,
వ.రా.11.18-రా.12.45
దు.1. మ.12.38-మ.1.29
దు.2. మ.3.11-సా.4.02
రాహు.ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు.

### వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం :** ఖర్చులను తగ్గించు విషయములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం :** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం :** కరస్పాండెన్సులు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం :** ఆర్థికపరమైన అంశాలు కొంత మేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలో అనుకోని మార్పులు వుంటాయి .

**తుల :** కోర్ట్ సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం :** కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు :** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటింటాలి.

**మకరం :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్ మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం :** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాష పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచన చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వానల కోసం..

>> వేదపండితులు రోజంతా ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పంటలకు సాగునీటి కొరత తలెత్తకుండా కృష్ణా, గోదావరి నదులకు సమృద్ధిగా ప్రవాహాలు రావాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ జలభద్రత కేవలం రాష్ట్రంలో నమోదయ్యే వర్షపాతంపైనే ఆధారపడి ఉండదు. కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలు రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు అత్యంత కీలకం. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం సుమారు 2.59 లక్షల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 44 శాతం కర్ణాటకలో, 27 శాతం మహారాష్ట్రలో ఉంది. అంటే కృష్ణా పరీవాహక ప్రాంతంలో 70 శాతానికిపైగా ఈ రెండు ఎగువ రాష్ట్రాల్లోనే ఉంది. కర్ణాటక, మహారాష్ట్రల్లోని పశ్చిమ కనుమలు, కృష్ణా, భీమా, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలే ఆల్మట్టి, నారాయణపూర్ మీదుగా జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు వచ్చే ప్రవాహాలను ప్రధానంగా ప్రభావితం చేస్తాయి. గోదావరి విషయంలోనూ ఇదే పరిస్థితి. సుమారు 3.13 లక్షల చదరపు కిలోమీటర్ల గోదావరి బేసిన్‌లో దాదాపు 49 శాతం మహారాష్ట్రలోనే ఉంది. నాసిక్, మరాఠ్వాడాతోపాటు ఎగువ, మధ్య గోదావరి ప్రాంతాల్లో కురిసే వర్షాలు తెలంగాణలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులకు వచ్చే ప్రవాహాలపై ప్రభావం చూపుతాయి. అందువల్ల రాష్ట్రంలో ఎంత వర్షం కురుస్తుందన్నదానితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షపాతం, ఎగువ జలాశయాల్లో నిల్వలు, అక్కడి నుంచి విడుదలయ్యే నీటిని నీటిపారుదల శాఖ నిరంతరం పర్యవేక్షి స్తోంది. ఆదివారం ఉదయం 9 గంటల నాటికి కృష్ణా ఎగువ ప్రాంతాల్లో ప్రవాహాలు ఆశాజనకంగా కనిపించాయి. ఆల్మట్టికి 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 86,155 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. 129.72 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను ఆల్మట్టిలో 113.71 టీఎంసీల నిల్వ ఉంది.

నారాయణపూర్‌కు సుమారు 42 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 18,654 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తెలంగాణలోకి కృష్ణా ప్రవాహాలకు ముఖద్వారంగా ఉన్న జూరాలకు సుమారు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అక్కడి నుంచి 46,543 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. 9.66 టీఎంసీల సామర్థ్యానికి గాను జూరాలలో 8.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో 215.807 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను 179.90 టీఎంసీల నీరు ఉంది. ఇంకా సుమారు 35.91 టీఎంసీల ఖాళీ సామర్థ్యం ఉంది. వరుణ యాగానికి వేదికగా మారుతున్న నాగార్జునసాగర్ మాత్రం ఇంకా భారీ ప్రవాహాల కోసం ఎదురుచూస్తోంది. నాగార్జునసాగర్ స్థూల నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 145.65 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అంటే జలాశయంలో ఇంకా దాదాపు 166.39 టీఎంసీల ఖాళీ సామర్థ్యం ఉంది.

సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (నీళిలి) 590 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం సుమారు 518 అడుగుల వద్ద ఉంది. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే పరిస్థితిలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గత ఏడాది ఆగస్టు 9న నాగార్జునసాగర్‌లో సుమారు 310.25 టీఎంసీల నిల్వ ఉండగా, నీటిమట్టం 589.40 అడుగుల వద్ద ఉంది. అంటే దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఈ ఏడాది అదే తేదీకి జలాశయంలో గతేడాది నిల్వలో సగానికంటే తక్కువ నీరే ఉంది రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సీజన్ మొత్తంలో వర్షాల విస్తరణ అత్యంత కీలకమని నీటిపారుదల వర్గాలు భావిస్తున్నాయి. ఒకటి, రెండు భారీ వర్షాలతోనే సాగునీటి అవసరాలు పూర్తిగా తీరవు. పంటలకు వివిధ దశల్లో తేమ అవసరం. చెరువులకు వరుస ప్రవాహాలు రావాలి. భూగర్భ జలాల పెరుగుదలకు నిరంతర వర్షాలు అవసరం. ప్రధాన జలాశయాలు నిండాలంటే ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి స్థిరమైన ప్రవాహాలు కొనసాగాలి. ఈ నేపథ్యంలో రుతుపవనాల మిగిలిన కాలంలో తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురవడం రాష్ట్ర జలభద్రతకు కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో జరుగుతున్న వరుణ యాగానికి ప్రాధాన్యం ఏర్పడింది. వర్షాలు పూర్తిగా ముఖం చాటేసిన పరిస్థితుల్లో కాకుండా, కృష్ణాలో ప్రవాహాలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ అవి సీజన్ అంతటా స్థిరంగా కొనసాగుతాయా అన్నది ఇంకా స్పష్టత రాని సమయంలో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణతోపాటు కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలన్నింటిలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదుల్లో ప్రవాహాలు పెరగాలని, ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వరుణ యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఒకవైపు వర్షపాత అంచనాలు, జలాశయాల నీటిమట్టాలు, ఇన్‌ఫ్లో-అవుట్‌ఫ్లోలను శాస్త్రీయంగా పర్యవేక్షి స్తూ ప్రభుత్వం జల నిర్వహణకు చర్యలు చేపడుతుండగా, మరోవైపు ప్రకృతి అనుకూలించాలని కోరుతూ భారతీయ వైదిక సంప్రదాయంలో వరుణ యాగాన్ని నిర్వహిస్తోంది. కృష్ణా తీరాన జరిగే ఈ మహాక్రతువులో ఒకటే సంకల్పం:- సమృద్ధిగా వర్షాలు కురవాలి.. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి, తెలంగాణ జలాశయాలు నిండాలి, రైతాంగం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## భారత్ చట్టాలను పాటించాల్సిందే

>> చట్టపరమైన చట్రానికి అనుగుణంగా ఉండేలా చూడటమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెటా తన సిఫార్సు అల్గారిథమ్‌లను పూర్తిగా మార్చాలని అధికారులు ఆదేశించారని చెప్పడం వాస్తవానికి తప్పు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దానికి బదులుగా, సంస్థ కంటెంట్ విధానాలు, అమలు యంత్రాంగాలు, ప్లాట్‌ఫారమ్ పాలన భారత చట్టపరమైన అవసరాలను తగినంతగా ప్రతిబింబించేలా చూడటమే కొనసాగుతున్న చర్చల ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొంది. అధికార వర్గాల ప్రకారం, ప్రభుత్వం లేవనెత్తిన ప్రధాన ఆందోళనలలో ఒకటి, దేశం వెలుపల ఉన్న బృందాలకు భారతదేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యంపై పరిమిత అవగాహన ఉండటం. కంటెంట్ నియంత్రణ నిర్ణయాల సామర్థ్యాన్ని, కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, భారతీయ భాషలు, సాంస్కృతిక సూ నైపుణ్యాలపై మెరుగైన అవగాహనతో సహా, మెటాకు బలమైన స్థానిక నైపుణ్యం అవసరమని అధికారులు తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై బాలల లైంగిక వేధింపుల కంటెంట్ (సిఎస్ఎఎం)ను ఏమాత్రం సహించబోమని ప్రభుత్వం పునరుద్ఘాటిస్తూ, దానిపై కూడా గట్టి వైఖరిని అవలంబించింది. సిఎస్ఎఎం ఉనికి అనేది వర్తించే నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని, అటువంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించడానికి మెటా మరింత పటిష్టమైన, చురుకైన భద్రతా చర్యలను అమలు చేస్తుందని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో కేవలం హామీలు కాకుండా, కచ్చితమైన చర్యలు అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. చర్చలలో డీప్‌ఫేక్ కంటెంట్ కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. అధీకృత లేదా ధ్రువీకరించబడిన ఖాతాల నుండి ప్రచురించబడిన కంటెంట్‌ను ఆటోమేటెడ్ సిస్టమ్‌ల ద్వారా తప్పుగా డీప్‌ఫేక్‌లుగా వర్గీకరించకూడదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇలాంటి కేసుల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, కంటెంట్‌ను తొలగించే నిర్ణయం తీసుకునే ముందు దానిని సరిగ్గా పరిశీలించేలా చూసేందుకు "మానవ ప్రమేయంతో కూడిన సమీక్షా ప్రక్రియను అధికారులు సమర్థించారు. డీప్‌ఫేక్‌గా గుర్తించి, తొలగించిన తర్వాత కూడా ప్లాట్‌ఫారమ్‌పై తిరిగి కనిపించే కృత్రిమంగా రూపొందించిన కంటెంట్ గురించి కూడా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.



రాంచీలో ఆదివారం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీ దృశ్యం

## రూ.54 కోట్ల డ్రగ్ దందా గుట్టురట్టు!

>> పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో నలుగురు పరారీలో ఉండగా.. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం కొండమడుగు గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఫార్చ్యూనర్ కారును అడ్డుకుని తనిఖీ చేయగా భారీ మొత్తంలో మెఫెడ్రోన్ బయటపడింది. కారులో 27 కిలోల మెఫెడ్రోన్‌తో పాటు సుమారు 40 కిలోల అసిటోన్ లభించడంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.విచారణలో కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లోనే మెఫెడ్రోన్ తయారు చేసినట్లు వెల్లడైంది. ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు ల్యాబ్‌లో ఇతర సహచరుల సహకారంతో మాదకద్రవ్యాన్ని తయారు చేసినట్లు నిందితులు పోలీసులకు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం తయారు చేసిన డ్రగ్‌ను కొండమడుగు నుంచి నాగ్‌పూర్‌కు తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. దీంతో పోలీసులు ల్యాబ్‌కు వెళ్లి తనిఖీలు నిర్వహించగా డ్రగ్ తయారీలో వినియోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలు లభించాయి.ఈ కేసులో నాగ్‌పూర్‌కు చెందిన చేతన్ మధుకర్ మెశ్రామ్ (49)ను డ్రగ్ తయారీకి ఆర్గనైజర్, ఆర్థిక సహకారం అందించిన వ్యక్తిగా గుర్తించారు. అస్సాంకు చెందిన ముజామల్ హక్ (25) డ్రగ్ తయారీలో సహకరించినట్లు, నాగ్‌పూర్‌కు చెందిన ఆకాశ్ అశోక్ గవాండే (31) అక్రమ రవాణాలో సహకరించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తి (65) వేటుకూరి ల్యాబ్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించినట్లు వెల్లడించారు.ఈ కేసులో అస్సాంకు చెందిన ఎం.డి. అయూబ్ అలీ, నాగ్‌పూర్‌కు చెందిన చందా ప్రదీప్ ఠాకూర్, గోపాల్ సిర్పట్ పటేలియా, వేటుకూరి ల్యాబ్స్ యజమాని యేటుకూరి రామరాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ల్యాబ్ ఏర్పాటు, ముడి పదార్థాల సమీకరణ, కెమిస్ట్ ఏర్పాటు నుంచి డ్రగ్ విక్రయం వరకు వీరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు.కొండమడుగులోని ల్యాబ్‌లో మాదకద్రవ్యాల తయారీకి అవసరమైన పరికరాలు, రసాయనాలు లభించడం పోలీసులను సైతం అప్రమత్తం చేసింది. ఇప్పటివరకు డ్రగ్ రవాణాకు మాత్రమే పరిమితమైన ముఠాలు జిల్లాలో తయారీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసుకున్నాయా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. 27 కిలోల మెఫెడ్రోన్‌ను నాగ్‌పూర్‌కు తరలించే ప్రయత్నం వెనుక ఉన్న నెట్‌వర్క్, డ్రగ్ తయారీకి అవసరమైన ముడి పదార్థాల సరఫరా మార్గాలు, నిధులు సమకూర్చిన వ్యక్తుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.సుమారు రూ.54 కోట్ల విలువైన మెఫెడ్రోన్ పట్టుబడటంతో ఈ కేసు జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ ప్రాధాన్యం సంతరించుకుంది. డ్రగ్స్ తయారీ, రవాణా వెనుక ఉన్న అంతర్రాష్ట్ర ముఠా ఆనుపానులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసులో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.ఎన్డీపీఎస్ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా, పంచుల సమక్షంలో చట్టపరమైన విధానాలను పాటిస్తూ స్వాధీనం, అరెస్టు ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం వేటుకూరి ల్యాబ్స్‌ను సీజ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.జిల్లాలో డ్రగ్స్ అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.యాదాద్రి డివిజన్ ఎస్డీపీవో, భువనగిరి డివిజన్ ఇన్‌చార్జి బి. శ్రీనివాస్ నాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. ఎస్వోటీ యాదాద్రిభువనగిరి ఇన్‌స్పెక్టర్ టి. ప్రవీణ్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు ఎస్. కృష్ణయ్య, ఎన్. రమేష్‌తో పాటు పోలీసు సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు. కోట్లాది రూపాయల విలువైన మెఫెడ్రోన్ పట్టుబడటంతో జిల్లాలో డ్రగ్స్ నెట్‌వర్క్‌పై పోలీసుల నిఘా మరింత కట్టుదిట్టం కానుంది.

## 'హర్ ఘర్ తిరంగ్గాలో పాల్గొనండి

>> కార్యక్రమాన్ని 'వందేమాతరమ్ణ ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్ణలో పోస్ట్ చేశారు. "మన త్రివర్ణ పతాకం మన గర్వకారణం, అలాగే దేశం కోసం ఎల్లప్పుడూ మన అత్యుత్తమ సేవలను అందించేలా ప్రేరేపించే నిరంతర శక్తి వనర్ణ అని ఆయన పేర్కొన్నారు. "జాతీయ గీతం 'వందేమాతరమ్ణ స్ఫూర్తితో ఈ కార్యక్రమం జరుగుతున్నందున, 'హర్ ఘర్ తిరంగ్గా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొందాం. అలాగే 'విక్షి త్ భారత్ణ (అభివృద్ధి చెందిన భారత్) నిర్మాణంలో మనమంతు కృషి చేసేందుకు సామూహిక సంకల్పాన్ని పునరుద్ధరించుకుందాం అని ఆయన అన్నారు.

## గనుల్లో దేశ వ్యాప్త ఆందోళన

>> వారు మాట్లాడుతూ బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు జూలై 1 నుంచి 12వ వేజ్‌బోర్డు కాలపరిమితి మొదలైందని, కానీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం కమిటీ వేయకుండా జాప్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్లు ఏ సంఘానికి రాకుంటే అధికారులే కమిషన్ ఏర్పాటు చేసి వారికి నచ్చిన ట్టుగా వేతనాల పెంపు చేపడుతున్నారని ఆరోపించారు. దీంతో కార్మికవర్గం అన్యాయానికి గురవుతుందని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

## ప్రియాంక మృతి

>> స్నేహితుడు ఉమేష్‌తో కలిసి స్కూటీపై వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రియాంక జిఎస్ఎల్ మెడికల్ కళాశాలలో డెర్మటాలజీలో పీజీఫస్ట్ ఇయర్ చదువుతుంది. ప్రియాంక సొంత ఊరు కర్నూలు కాగా ప్రస్తుతం కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ముద్దాయిలు సూరవరపు దస్వంత్, ఆంధ్రు జోసఫ్ ఎడ్వర్డ్స్ పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల ఆరవ తేదీన ఈ ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. కాగా వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో విద్యార్థులు నిరసన ర్యాలీలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిందితు లను కఠినంగా శిక్షించాలని ప్రియాంకకు న్యాయం జరిగే విధంగా అండగా నిలబడ తాననిచెప్పారు. సోమవారం ప్రియాంక మృతి సంతాపంగా విద్యాసంస్థలు బంద్ పాటిం చాలని పిలుపునిచ్చారు. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

**'మెడికో ప్రియాంకపై హత్యాయత్నం'**

వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాజమండ్రిలో ప్రియాంక కేసుపై ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ కావాలనే ఆమెను కారుతో ఢీకొట్టినట్లు వీడియోలు చూస్తే అర్థమవుతుందని నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసు పెట్టాం అని వెల్లడించారు. అలాగే డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలను కోర్టు అనుమతితో కస్టడికి తీసుకుని మరింత లోతుగా విచారి స్తామని ఎస్పీ నరసింహ కిశోర్ చెప్పారు. ముద్దాయిలు వెనక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారిస్తున్నామని ఈ కేసులో ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముద్దాయిలు ప్రియాంకను ఉద్దేశం పూర్వకంగా చేసారా అని మరింత లోతుగా విచారణ చేయడం జరుగుతుందన్నా రు. యాక్సిడెంట్ జరిగిందని ఎస్ఐకి సమాచారం రావడంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ఐ సిబ్బంది వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లడం జరిగిందని అక్కడ యాక్సిడెంట్ అయిన ప్రియాంకను ఒక వ్యక్తి కారులో జిఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్ కి తీసుకెళ్లారు. మాల్ వద్ద సీసీ పుటేజీలు పరిశీలించి కార్ నెంబర్ను ఐడెంటిఫై చేశారని వెంటనే పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి ముద్దాయి లను కారు గురించి వెతకడం మొదలుపెట్టారు. నాలుగో తేదీన ప్రియాంక స్నేహితులు ఉమేష్ ఎంఎల్సి స్టేట్మెంట్ ప్రకారం బి.ఎన్.ఎస్ గా వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అదే రోజు ప్రత్యక్ష సాక్షులను స్థానికులను విచారించి బి ఎన్ ఎస్ సెక్షన్ నుండి 110 గా అటెంప్ట్ టు కమిట్ కల్పిబుల్ హోమిసైడ్ గా కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు. ఈనెల ఆరవ తేదీన బి ఎన్ ఎస్ కేసులో ముద్దాయిలు ఏ 1 సూరవరపు దస్వంత్, ఏ2 ఆంధ్రు జోసఫ్ ఎడ్వర్డ్స్ లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇద్దరు ముద్దాయిలను ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందని అనంతరం వారిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. దస్వంత్ చెన్నైలో బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ వెళ్లడానికి ప్రిపేర్ అవుతున్నాడని ఆంధ్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్ లాలాచెరువులోని లారీ ఆఫీస్ లో పనిచేస్తున్నాడని తెలిపారు.




# నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు

## మరో ఇద్దరు న్యాయమూర్తుల బదలీ

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం బొంబాయి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ రవీంద్ర విఠల్‌రావు ఘుగేను కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసింది.

ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠిని బొంబాయి హైకోర్టు ప్రధానన్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. అంతేకాకుండా, ప్రస్తుతం పంజాబ్–హర్యానా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీకుమార్ మిశ్రాను ఆ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన ఈ సిఫార్సులను, ఇప్పుడు పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సులను ఆమోదించి, అవసరమైన నోటిఫికేషన్లను జారీ చేసిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి.

ప్రస్తుతం, దేశంలోని ఇరవై ఐదు హైకోర్టులలో ఏడింట శాశ్వత ప్రధాన న్యాయమూర్తులు లేకుండా పనిచేస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణలు, సుప్రీంకోర్టుకు పదోన్నతుల కారణంగా బొంబాయి, కలకత్తా, జమ్మూకాశ్మీర్, లడఖ్, మధ్యప్రదేశ్, పాట్నా, పంజాబ్– హర్యానా, రాజ స్థాన్ హైకోర్టులకు ప్రస్తుతం తాత్కాలిక ప్రధానన్యాయమూర్తులు నాయ కత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే, ఈ తాజా సిఫార్సుల ద్వారా ఈ ఖాళీలలో ఐదింటిని భర్తీ చేయవచ్చు.

# ప్రపంచ నాగరికతకు మూలం ఆదివాసీ సంస్కృతి

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు

## తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** ప్రకృతిని దైవంగా, అడవిని తల్లిగా, తమ సంస్కృతి సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న ఆదివాసీ సోదర సోదరీమణులకు 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలి యజేశారు. ప్రపంచ నాగరికతకు మూలం, ప్రకృతితో మమేకమైన జీవనవిధానం ఆదివాసీ సంస్కృతి. తరతరాలుగా ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా మలుచుకున్న ఆదివాసీ సమాజాల జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమష్టి జీవనవిధానం, సాంస్కృతిక పరి రక్షణ... యావత్ మానవాళికి మార్గదర్శకం. వారి హక్కులను, అస్తి త్వాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధి, ఆత్మ గౌరవం కోసం మనమంతా కలిసి నిలబడాలి' అని పేర్కొన్నారు.

# పిజి విద్యార్థినిపై సెక్యూరిటీ గార్డు అత్యాచారం

**గాంధీనగర్, ఆగస్టు 9:** పీజీ వసతి గృహంలో నివసిస్తున్నఒక విద్యార్థిని రాత్రి వేళ వాకింగ్ కోసం టెర్రస్‌పైకి ఆమె వెళ్లింది. అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ యువతి మెడకు వైరు బిగించి ఆమెపై అత్యాచారానికి పాల్ప డ్డాడు. అక్కడి నుంచి పారిపోయిన ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని అహ్మదా బాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఆ యువతి ఇంటీరియర్ డిజైనింగ్ చదువుతున్నది. ఆనంద్‌నగర్ ప్రాం తంలోని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంలో ఆమె నివసిస్తున్నది. ఈనెల 8న డిన్నర్ తర్వాత వాకింగ్ కోసం రాత్రి 10 గంటల సమయం లో హాస్టల్ బిల్డింగ్ టెర్రస్‌పైకి ఆ యువతి వెళ్లింది. అక్కడ సెక్యూరిటీ గార్డు ఉండటంతో కిందకు వచ్చేందుకు ఆమె ప్రయత్నించింది. అయితే సెక్యూరిటీ గార్డు ఆ మహిళ మెడకు వైరు చుట్టి బంధించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. గాయాలతో ఉన్న ఆ యువతిని గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.





జూరాల గేట్లు మూసివేసిన దృశ్యం

# జూరాల గేట్లు మూసివేత

## 63వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 878 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 8 ప్రభాతవార్త:** జూరాలకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.415 టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల ప్రాజెక్టుకు 63,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. దీంతో డ్యాం గేట్లు మూసివేశారు. పవర్ హౌస్ ద్వారా 43,686 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మొత్తంగా జూరాల నుంచి 47,060 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు అయింది. 878టీఎంసీలకు శ్రీశైలం జూరాల నుంచి వరద వస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి జలకళ సంతరించుకున్నది.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు 215.8070 టీఎంసీలకు గాను ప్రస్తుతం 878.10 అడుగులకు చేరి 178.7400టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల పవర్ హౌస్ నుంచి 36,233 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. శ్రీశైలంలోని రెండు ఎడమ కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కుడి జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,306 క్యూసెక్కులు, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

## 55 దేశాల్లో మాత్రమే దృశ్యమానం..

## రాత్రివేళ కావడంతో భారత్‌లో కనిపించదు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఈ నెల 12న బహుళ అమావాస్య రోజున సంపూర్ణ సూర్యగ్రహణం రూపంలో ఖగోళంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. యూరప్, రష్యా, ఉత్తర అమెరికా సహా 55 దేశాల్లో ఎనిమిది గంటలకు పైగా కనువిందు చేయనున్న ఈ గ్రహణం ఒక్క స్పెయిన్, ఐస్‌లాండ్‌లో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది. మిగతా దేశాల్లో పాక్షికంగానే కనిపించనుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రహణం మొదలు కానుండగా సంపూర్ణ గ్రహణం రాత్రి 9.15 గంటల సమయంలో ఏ ర్పడనుంది. గరిష్ఠ కాలం రాత్రి 11.17 గంటలకు వుండనుంది. దీని తరువాత తెల్లవారుజామున 1.20 గంటలకు సంపూర్ణ దశ ముగింపు మొదలవనుంది. తెల్లవారుజామున 3.30 గంటలకు గ్రహణం ముగియనుంది. రాత్రి వేళలో సూర్య గ్రహణం ఏర్పడనుండడంతో భారత్‌లో ఇది కనించదు. ఐస్‌లాండ్, స్పెయిన్ దేశాల్లో సంపూర్ణ సూర్య గ్రహణాన్ని పూర్తిగా వీక్షించే అవకాశం వుండడంతో సూర్యుడిపై పరిశోధనలకు ఖగోళ శాస్త్రవేత్తలు ఆ దేశాలకు ముందుగానే పయనమయ్యారు. ఇక ఈ గ్రహణం భారత్‌లో ఎక్కడ కనిపించ నందున ఇక్కడ ఎలాంటి సూతకం లేదని, ఆలయాల మూసివేత వుండదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కర్కాటక రాశిలోని అశ్లేషా నక్షత్రంలో కేతుగ్రస్త సూర్య గ్రహణంగా సంభవి స్తోంది. కర్కాటక రాశి వారు శాంతి పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు.

బహుళ అమావాస్య ను హిందువులు చుక్కల అమావాస్యగా పిలుస్తారు. పలు దేవాలయాల్లో ఇదే రోజున తాంత్రిక పూజలు చేయడం విశేషం. ఈ ఏడాది ఇది రెం డవ సూర్య గ్రహణం కావడం గమనార్హం. మొదటిది పాక్షిక సూర్య గ్రహణం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 17న సంభవించగా ఇది కూడా భారత్‌లో కనిపించలేదు.

ఇదిలా ఉండగా ఈ నెల 12న సూర్యోదయానికి ముందు ఆకాశంలో ఆరు గ్రహాలు ఒకే ప్రాంతంలో వరుసగా కనువిందు చేయనున్నాయి. బృహస్పతి, బుధుడు, అంగారకుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ తూర్పు నుంచి పడమర వైపు విస్తరించి వరుసగా కనిపిస్తాయి. వీటిలో అంగారకుడు, శని వంటి ప్రకాశవంతమైన గ్రహాలను అందరు వీక్షించే వీలుంది. ఇతర గ్రహాల వీక్షణకు దూరదర్శిని అవసరం వుంటుంది. ఇదే సమయంలో ఆ రోజున రాత్రి ఉల్కా వర్షం కురవనుంది.

**28న పాక్షిక చంద్రగ్రహణం**

మరోవైపు ఆగస్టు 28వ తేదీన పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రక్షా బంధన్ పండగ రోజున భారత కాలమానం ప్రకారం ఈ గ్రహణం మధ్యాహ్నం 12.12 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు వుండనుంది. పగటి వేళ అయినందున ఇది భారత్‌లో కనిపించ దు. దీంతో భారత్‌లో సూతకం వుండదని పండితులు చెబుతున్నారు.

# కామన్వెల్త్ క్రీడాకారులతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తిరిగి వచ్చిన భారత బృందానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తన ఢిల్లీ నివాసంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ దేశ పతక విజేతలతో సుదీర్ఘంగా సంభాషించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. వారి అద్భుతమైన ప్రదర్శనను ప్రశంసిస్తూ, యావత్ దేశం తరపున అభినందనలు తెలిపారు. ఆయన సోషల్ మీడియాలో ఓ వీడియోను కూడా పంచుకున్నారు, అది వేగంగా వైరల్ అవుతోంది. ప్రధాన మంత్రి తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పంచుకోవడం ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెట్లతో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం గురించి తెలియజేశారు. ఆ వీడియోలో ఆయన స్వర్ణ పతక విజేత బాక్సర్ సాక్షి చౌదరి, పలువురు ఇతర ఛాంపియన్‌లతో సంభాషిస్తూ కనిపించారు. ఆ వీడియోలో సాక్షిచౌదరి ప్రధాని మోడీ నిరాడంబరతను ప్రశంసిస్తూ ప్రధానమంత్రిని కలవడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఆయన చాలా వినయశీలి అని అన్నారు. సంభాషణ సందర్భంగా ఆటగాళ్లు ప్రధానమంత్రిని ఏదైనా మాట్లాడమని కోరగా దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే తన ప్రసిద్ధ సందేశాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు, జో ఖేలేగా, వో ఖిలేగా! ఆల్వేస్ చీర్4భారత్. అంటూ చివరకు భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తూ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించి, మొత్తం 39 పతకాలను గెలుచుకోవడం గమనార్హం. వీటిలో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచగా ప్రధానమంత్రితో ఈ సమావేశం అథ్లెట్ల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.



# కాశీవిశ్వనాథుడిని దర్శించిన గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు9:** గవర్నర్ శివప్రతాప్ శుక్లా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వారణాసిలోని పవిత్ర కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విశ్వనాథుడి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తెలంగాణతోపాటు దేశ ప్రజల శాంతి, సౌభాగ్యం, సమృద్ధి, సర్వతో ముఖ అభివృద్ధి కోసం గవర్నర్ బాబా విశ్వనాథుడిని ప్రార్థించారు. కాశీ విశ్వనాథుడి దివ్యసన్నిధి భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను, శక్తిని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే గొర్ల సిద్దయ్య కన్నుమూత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు9:** సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లికి చెందిన చేర్యాల మాజీ ఎమ్మెల్యే గొర్ల సిద్దయ్య(95) ఆదివారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు,రాజకీయ నేతలు,అభిమానులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో సిద్దయ్య చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. కాగా, 1978లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. సిద్దయ్య కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. బైరాన్‌పల్లిలో పుట్టి పెరిగిన సిద్దయ్య 17 ఏళ్ల వయస్సులో ఆ గ్రామంలో జరిగిన రజాకార్ల ఊచకోతను కళ్లార చూశారు. ఆయన పోటీ చేసిన గెలిచిన చేర్యాల నియోజకవర్గం 2009లో రద్దయి జనగాం నియోజకవర్గంలో విలీనం అయింది.

# గిరిజన గురుకులాల్లో 17 నుండి ఇన్‌స్ట్రక్టర్ల సమ్మె

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు గిరిజన ఆశ్రమ పాఠశాల్లోని అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం వెల్లడించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2015 నుంచి ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నామని, అయినా తమకు రూ.10,470 వేతనాన్ని మాత్రమే చెల్లిస్తున్నారని సంఘం నేతలు వాపో యారు. పెరిగిన ఖర్చులతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలి పారు. ఇదే విషయమై అనేకసార్లు ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో సమ్మెకు దిగాల్సి వచ్చిందని, వేతనాలు పెంచేవరకూ ఆందోళనేనన్నారు.

# పంటల బీమా నమోదు గడువు 15 దాకా పెంపు

## అమలుచేయని తెలంగాణ సర్కార్

## రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల ఎకరాల్లో సాగు

## ఫసల్ బీమాలోకి వస్తే ప్రభుత్వానికి రూ.1,600 కోట్లు భారం

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఎల్‌నినో, అతివృష్టి, అనావృష్టి నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా పంటల బీమా (ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన) నిమిత్తం రైతులు దర ఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచుతూ కేంద్రం నిర్ణయించింది. ఈ పంటల బీమా పథకాన్ని ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసు కునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రకృతి వైపరీ త్యాలు, అకాలవర్షాలు, వరదలు, కరువు లేదా తెగుళ్ల వల్ల పంట నష్టం వాటిల్లితే రైతులకు ఆర్థిక భరోసా కల్పించే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా నమోదు గడువును పొడిగించడంతో, ఇంకా బీమా నమోదు చేసుకోని రైతులు తక్షణమే సమీపంలోని సీఎస్సీ, మీసేవ కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా రాష్ట్రంలో పంటల బీమా అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్రఉదాసీన వైఖరి అవలంబిస్తోందనే విమ ర్శలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలు దెబ్బతిని రైతులు కోలుకోలేని దెబ్బతింటున్నారు. అధికారంలోకి వచ్చిన తదుపరి ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు చేస్తామని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో పాటు, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం సొమ్మును కూడా తామే భరిస్తామని వ్యవసాయ శాఖ ప్రకటించింది. అంతేకాకుండా బీమా కంపెనీలతో సైతం గత ఏడాది చర్చలు కూడా జరిపింది. వ్యవసాయ శాఖ అంచ నాల మేరకు వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు కలిపి 1,300 కోట్ల రూపాయల మేర ప్రీమియం రూపంలో బీమా కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసింది. అందుకోసం 2025–26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్లో ప్రభుత్వం ఈ మేరకు నిధులు కూడా కేటాయించింది. బీమా ప్రీమియంలో రైతుల వాటాగా దాదాపు రూ.300 కోట్లు మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే అవన్నీ ప్రతిపాదనలుగా మిగిపోగా ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఎటువంటి పంటల బీమా కూడా లేకపోవడతో రైతుల పరిస్థితి గాలిలో దీపంలా తయారైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఈగల్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్

## హాష్‌ఆయిల్ స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 200 మిల్లీ లీటర్ల హాష్ ఆయిల్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన బర్సె నరేంద్ర శ్రీనివాస్ (30) చాలా కాల ంగా హైదరాబాద్‌లో వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటుపడ్డ ఇతను ఐదేళ్ల క్రితం డ్రగ్ స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో ఇతనిపై సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీసు స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి. గత ఏడాది మే నెలలో మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టయి నవంబర్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం మళ్లీ కొద్దిరోజులు డ్రైవర్‌గా పనిచేసినా ఆదాయం సరిపోక పోవడంతో మళ్లీ డ్రగ్స్ దందా చేయసాగాడు. స్నాప్ చాట్‌లో ఒడిషాలోని కోరాపూర్‌కు చెందిన హారీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్ కొన సాగా డు. దీనిని జంట నగరా లలో ఎక్కువ ధరకు విక్ర యిస్తూ దండిగా సంపా దించ సాగాడు. అయితే ఇతని కదలికలపై ఈగల్ పోలీసులు నిఘా వుం చారు. తాజాగా ఇతను ఈ నెల రెండవ తేదీన వైజాగ్ మీదుగా ఒడిశా లోని కోరాపూర్ జిల్లాకు వెళ్లి హాష్ ఆయిల్ స్మగ్లర్ హారితో భేటీ అయ్యాడు. అక్కడ నాలుగు రోజులు వున్న తరువాత తొమ్మిది వేల రూ పాయలు చెల్లించి 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్‌ను తీసుకుని వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులో వచ్చాడు. నరేంద్ర శ్రీనివాస్ గురించి పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఆదివారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ వద్ద కాపుకాశారు. విజయవాడ నుంచి వస్తున్న బస్సులో ఇతను వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద దిగాడు. అనంతరం ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఈగల్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు.



నిందితుడి బ్యాగుల్లో 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్ పట్టుబడింది. దీని విలువ రెండున్నర లక్షల రూపాయలుగా తేలింది. ఒడిషాలో కొన్న హాష్ ఆయిల్‌ను జంట నగరాలలో పది మిల్లీ లీటర్‌గా చిన్న బాటిల్‌లో వుంచి 1200 రూపాయలకు ఇతను అమ్ముతున్నట్లు తేలింది. నిందితుడిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ కేసులో ఒడిషా స్మ గ్లర్ హారి కోసం గాలిస్తున్నారు. కాగా నరేంద్ర శ్రీనివాస్ నుంచి పది మంది హాష్ ఆయిల్ కొన్నట్లు తేలగా వారి కోసం కూడా గాలిస్తున్నారు.

# ప్రజల్లో సెంటిమెంట్ రెచ్చగొట్టాలని చూస్తోన్న బిఆర్ఎస్

## కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జల ఉద్యమం చేస్తామంటున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. కానీ తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను జల సమాధి చేశారని అన్నారు. కెటిఆర్ కు చామల కౌంటర్ ఇచ్చారు. మాజీ సిఎం కెసిఆర్ రాయలసీమ వెళ్లి వైసిపి మాజీ మంత్రి ఆర్ కె రోజా ఇంట్లో చేపల పులుసు తినలేదా? అని రాయలసీమను రతనాల సీమ చేస్తామని కెసిఆర్ అనలేదా? అని ఎపి మాజీ సిఎం వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డిను ప్రజాభవన్ కు పిలిచి కెసిఆర్ బిర్యానీ పెట్టారని, గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయని జగన్‌తో కెసిఆర్ అన్నారని తెలియజేశారు. సిఎం రేవంత్‌రెడ్డికి చంద్రబాబునాయుడుతో అవగాహన ఉందని దుష్ప్రచారం చేస్తున్నారని, తెలంగాణ ప్రజల్లో సెంటిమెంట్ రెచ్చగొట్టాలని బిఆర్ఎస్ చూస్తోందని మండిపడ్డారు.

# రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ ప్లాంట్ల సామర్థ్యం

**6,485 మెగావాట్ల నుండి 9,624 మెగావాట్లకు చేరిక**

**32,568.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి**

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ రంగంలో వేగవంతమైన మార్పులు జరిగాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో ప్లాంట్ల సామర్థ్యంలో పెరుగుదల చోటు చేసుకుంది. జెన్కో అధికారవర్గాల ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వీటి వివరాలను వెల్లడించాయి. దీని ప్రకారం 2024 మార్చి 31 నాటికి, రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం 6485.26 మెగావాట్లు ఉండగా, గత నెలాఖరుకు అది 9624.96 మెగావాట్లకు చేరుకుంది. ఇందులో 7180 మెగావాట్లు థర్మల్, మరో 2441.76 మెగావాట్లు జల విద్యుత్, 3.2 మెగావాట్లు సౌర విద్యుత్ సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఉన్నాయి. ఈ విధంగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల సామర్థ్యం క్రమేపీ పెంచుతూ వస్తోంది. మరోపక్క కేవలం విద్యుత్ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యం పెరగడమే కాకుండా, ఇదే సమయంలో రాష్ట్ర అవసరాలను తీర్చడంలో జెన్కో పాత్ర కూడా గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర గ్రిడ్ విద్యుత్ అవసరాల్లో 36.97 శాతం వాటాను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ సమకూర్చింది. ఇందుకు అనుగుణంగా 32,568.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. అంతకుముందు 2024–25లో 26,960.18 మిలియన్ యూనిట్ల ఉత్పత్తితో 30.2 శాతం వాటా ఉన్న సంస్థ, ఇప్పుడు దాదాపు 37 శాతం వాటాకు చేరడం దాని ఉత్పత్తి సామర్థ్యంలో వచ్చిన పెరుగుదలను తెలియజేస్తోంది. ఇందులో జలవిద్యుత్ ఉత్పత్తి కూడా కీలక పాత్ర పోషించింది. 2025–26లో 6,912.42 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్ ఉత్పత్తి జెన్కో చరిత్రలో ఒక సరికొత్త రికార్డుగా నిలిచింది. సంస్థ సగటు రోజువారీ విద్యుత్ ఉత్పత్తి కూడా 2024–25లో 79 మిలియన్ యూనిట్ల నుంచి 2025–26లో 95.4 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఇవన్నీ కలిపి చూస్తే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో పాటు, ఉత్పత్తి, వినియోగంలోనూ జెన్కో సత్ ఫలితాలను సాధిస్తోందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# భారీగా పడిపోయిన చికెన్ ధరలు

## గుడ్డు రూ.10 నుండి రూ.7కు తగ్గిన ధర

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చికెన్, కోడి గుడ్ల ధరలు భారీగా పతనమయ్యాయి. ఇటీవల కిలో చికెన్ రూ.330 వరకు చేరుకోగా ఒక్కో గుడ్డు రూ.10 పలికింది. అయితే ఇప్పుడు చికెన్‌తో పాటు, కోడి గుడ్ల ధరలు కూడా భారీగా పడిపోయాయి. గత కొద్ది రోజుల నుంచి చికెన్ ధరలు కుప్పకూలుతున్నాయి. దీంతో నాన్ వెజ్ తినేవారు ఊరట చెందుతున్నారు. తెలంగాణలో బోనాల సందర్భంగా చికెన్ విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. బోనాలతో పాటు, ఆదివారం కావడంతో చికెన్ దుకాణాల వద్ద భారీ రద్దీ ఏర్పడింది. ఈ సమయంలో ధరలు తగ్గడం పెద్ద ఊరటగా చెప్పవచ్చు. హైదరాబాద్ జోన్‌లో ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.240 వద్ద కొనసాగుతుండగా, డ్రెస్సెడ్ చికెన్ రూ.212గా ఉంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.137గా ఉండగా, ఎక్స్ ఫారం ధర రూ.110 పలుకుతోంది. రాష్ట్రంలోని కరీంనగర్ తదితర జోన్లలో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240, డ్రస్స్‌డ్ రూ.212, రిటైల్ లైవ్ బర్డ్ రూ.137, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.110 పలుకుతోంది.

# గిరిజనుల అభివృద్ధికి ఆర్థికంగా తోడ్పాటు

## ఉపకార వేతనాలకు రూ.452 కోట్లు ఇవ్వాలి

## సంక్షేమం, విద్య, మౌలిక సదుపాయాలకు సాయం

## కేంద్రానికి రాష్ట్ర సర్కార్ ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** తెలంగాణలో గిరిజన సంక్షేమం, విద్య, మౌలికసదుపాయల కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని కోరింది. గిరిజన ప్రాంతాల్లో జీవన పరిస్థితులు, మౌళిక సదుపాయాలను మెరుగుపరచే లక్ష్యంతో కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రభుత్వం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంకు వీటికి సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన మెమోరాండం సమర్పించింది. రాష్ట్రంలోని గిరిజన విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.452 కోట్లను తక్షణమే విడుదల చేయాలని పేర్కొంది. నిధుల పంపిణీలో జాప్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు గాను బకాయి ఉన్న స్కాలర్‌షిప్ నిధుల్లో కేంద్రం వాటాతో పాటు, ప్రస్తుత 2026–27 సంవత‌సరానికి సమర్పించిన ప్రతిపాదన మొత్తాన్ని కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ స్కాలర్‌షిప్ బకాయిలతో పాటు, గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 275(1) కింద అదనంగా రూ.70 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. కాగా పెరుగుతున్న అభివృద్ధి అవసరాలు ఉన్నప్పటికీ ఈ ఆర్టికల కింద తెలంగాణకు కేటాయింపులు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 98.4 కోట్ల నుండి 2025–26 సంవత్సరంలో రూ.35.2 కోట్లు, 2026–27లో 32.1 కోట్లకు తగ్గాయని, ఈ తగ్గింపు లేకుండా కేటాయింపులు పెంచాలని కోరింది. అలాగే 424 గిరిజన గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రధాన మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన కింద రూ.11.8 కోట్లు విడుదల చేయాలని కేంద్రానికి సమర్పించిన మెమోరాండంలో రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

వార్త

విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్నవాళ్లు విజయం సాధించి తీరుతారు.

న- డబ్ల్యు. ఎమర్సన్

# సాగీ సాగని 'సాగు'!

కాస్త ఆలస్యంగానైనా వర్షాలు పడ్డాయి కానీ ఖరీఫ్ సాగుకు అవసరమైన తరుణంలో వానలు కురవకపోవడమొక్కటే తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని వేధిస్తున్న ఒకే ఒక బెంగ. ఎల్‌నినో, దానివెంట సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో హెచ్చరించి, ఎలా ఎదుర్కోవాలో చెప్పి రైతును ముందస్తు సన్నద్ధ చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందు చూపుతోనే వ్యవహరించారని చెప్పాలి. అంతేకాదు రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వాలు ఏ ఆప్షన్‌ను వదులుకోలేదు. దేవాలయాల్లో వరుణ యాగాలు కూడా మొదలెట్టేశాయి. ఏమైతేనేం ఈసారి వర్షాలు కురిసాయి. వీటితో పంటలు నిలబడతాయానే అనుకోవాలి. 'వరి'కి తగినంత నీరు అందించలేమనే ఉద్దేశంతో ఉభయ రాష్ట్రాలు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని హితబోధ కూడా చేసింది. మార్కెటింగ్‌లో కూడా వీలైన పరిస్థితులు ప్రత్యామ్నాయపంటకే సానుకూలమని నచ్చచెప్పినా సాంప్రదాయ రైతు 'వరి'కే మొగ్గుచూపాడు. తాజా గణాంకాల ప్రకారం 'వరి' విషయంలో రైతు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దేవుని మీద భారం పెట్టేసి విత్తునాటేసాడు. ఇప్పుడు కొనసాగుతున్న వానలువరదలై రైతును ఆనందోత్సాహాల మధ్య ముంచుతున్నా, పంటల యాజమాన్యంలో ఎన్నిసమస్యలు ఎదురు చూస్తారో ఇప్పుడిప్పుడే అంచనా వేయలేం. ప్రస్తుతానికైతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులు వర్షానందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న వర్షాలతో పూర్తిస్థాయి సాగు నడుస్తుందో లేదో పంట ఉత్పత్తులు సజావుగా బయటపడతాయో లేదో చెప్పేందుకు ఎదురు చూడాల్సిందే. ఈ వర్షాలు ప్రస్తుతానికైతే ఊరటనిస్తున్నాయి. అలా అని 'ఎల్‌నినో' ముప్పు ఉండదని, గట్టెక్కేసినట్లేనని చెప్పే పరిస్థితులు మృగ్యం. వచ్చే రబీ సీజన్‌లో కూడా ఎల్‌నినో ముప్పు ఉంటుందని ఏనాడో శాస్త్రజ్ఞులు విశ్లేషించి చెప్పారు. సకాలంలో నీరు రాక ఎండిపోయిన నేలలు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం కళ్లెదుట కనిపిస్తున్న వాన పరిస్థితులతో తెలుగు రాష్ట్రాల రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. అయినా వర్షాల అనిశ్చితితో ఎదుర్కోవాల్సిన కష్టాలు ముందున్నాయి. 2026లో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చెప్పుకోదగినట్లుగానే ఉంటుందని భారత్ వాతావరణ సంస్థ ముందుగానే హెచ్చరించినందున రైతు వర్షాల కోసం ఎదురు చూశాడు. అవి రానే వచ్చాయి. అన్ని చోట్లా సరిపడే వర్షాలు కురిసినట్లు చెప్పుకుంటున్నా నీటి పంపిణీలో ఎగుడుదిగుడుల కారణంగా సాగు పరిస్థితులపై అప్పుడే ఓ నిర్ణయానికి రాలేం. అంటే ఓ ప్రాంతానికి వానవెల్లువ, అదే ప్రాంతంలోని మరో చోట వర్షాభావం ఉంటే సాగు బహుకష్టమే. ఆంధ్రప్రదేశ్‌లో జలాశయాల్లో నీటి నిల్వలను బట్టి ఖరీఫ్‌సాగు పురోగతి ఉంటుంది. జులై చివరి నాటికి ఈ రాష్ట్రంలో వర్షపాత లోటు గణనీయంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలో వర్షపాతం లోటుతో సాగు ఆలస్యమైంది. తాజాగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాల పరిస్థితిని బట్టే తెలంగాణ జలవనరులు దాదాపు అందుబాటులోకి వచ్చాయి. ఉభయ రాష్ట్రాలలో తక్కువ నీటితో సాగయ్యే పంటల మీద కూడా రైతాంగం శ్రద్ధ పెట్టినందునచేలలో తేమను కాపాడుకోవడం, వాననీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడంలో రైతు అప్రమత్తంగా ఉండడం అవసరం. ఎన్ని హెచ్చరికలు చేసినా పంటల వైవిధ్యీకరణ నేపథ్యంలో పంటల సాగులో 10శాతంరైతులు అధిక విస్తీర్ణంలో విత్తారు. వరి సేద్యాన్ని ఎవరూ వదిలిపెట్టలేదు. ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రస్తుతం ఖరీఫ్ నాట్లు బాగానే పడ్డాయి. కాస్త అటూఇటూగా నాటినా పంటల పెరుగుదలలో ఉన్నాయి. తాజా వర్షాలలో ఉభయ రాష్ట్రాలో సాగులోటు బాగా తగ్గింది. తెలంగాణలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈసారి రాష్ట్రంలో సాగు విస్తీర్ణమైతే పెరిగింది. ఇప్పటి వరకు సాగు విస్తీర్ణంలో అధిక భాగం వరి,పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారు. గతంతో పోల్చి చూస్తే పప్పుధాన్యాలు, నూనెగింజలు పంటల విస్తీర్ణం పెరుగుదల చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం సాగు 32.05 లక్షల హెక్టార్లు తెలంగాణ ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 31.16 లక్షలు. దీర్ఘకాలిక పంట నమూనాలో పత్తి, వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు,వేరుసెనగ, ప్రధానంగా ఉన్నాయి. ఇకపై సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పంట ఉత్పత్తులు మార్కెట్‌కి చేరే వరకు జాగ్రత్తగా కంటికిరెప్పలా చూసుకోవాలి. ఈసారి నైరుతి రుతుపవనాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాధారణం కంటే 8శాతం నుంచి 12 శాతం అధిక వర్షాలు పడినట్లే. ఉద్యాన పంటలకు అతివృష్టి దెబ్బ తగ్గింది.తొలుత ఎల్‌నినో ప్రభావంతో కరవువస్తుందని కంగారు పడ్డాం.కానీ జులైనెలలో అతివృష్టితోఆంధ్రప్రదేశ్‌లో గోదావరి కృష్ణా డెల్టా సాగు సంతృప్తికరమే. రాయలసీమలో చెరువులు నిండక 30 శాతం ఆయకట్టు తగ్గింది. మిర్చికి తొలిరోజుల్లో పూతరాలిపోయి 25శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కోస్తా జిల్లాల్లో విరివిగా పండే అరటి, మామిడి ఈదురుగాలులు కారణంగా చెట్లు నేల కొరిగాయి. ఇక తెలంగాణలో కూరగాయల తోటలు నీట మునిగాయి. ఇవన్నీ అనుకోకుండా వచ్చిన నష్టాలే. వీటన్నిటి నుండి రైతుతేరుకోవడం ఎంతో కష్టం.వర్షాధార పంటలకు భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ వర్షాలు ఏమూలకీ సరిపోవు.నీటి వినియోగ అవసరాలను గుర్తించి నీటి మళ్లింపు ప్రక్రియకు వ్యవసాయ శాఖ మార్గదర్శనం చేయాలి. ప్రస్తుతం నడుస్తున్న పంటల భీమా పథకాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. అప్పుడే రైతు మనసు తేలికపడుతుంది.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు

## సమగ్ర కార్యాచరణ అవసరం

భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాలనియంత్రణ ప్రభుత్వాలరాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యా దులు, సుమారు రూ.55,493 కోట్ల ఆర్థిక నష్టం నమోదవవడంసమస్య తీవ్రతను తెలియజేస్తోంది. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు విస్తరిస్తున్న వేళ, భద్రతావ్యవస్థలు కూడా అదే స్థాయిలో బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మోసగాళ్లు ఫేక్ లింకులు, ఫిషింగ్ సందేశాలు, నకిలీ ఫోన్ కాల్స్, వాట్సాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి ఆఫర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీడబ్బు తిరిగిపొందడం,కేసుల దర్యాప్తు పూర్తవడం చాలా సందర్భాల్లో ఆలస్యమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వరుణ యాగాలు సిగ్గుచేటు!

తెలంగాణలో వర్షాభావం ఏర్పడిందనీ ఈ నెల పదవ తేదీ నాగర్జున సాగర్ వద్ద వరుణ యాగం తల పెట్టడం రేవంత్ రెడ్డి ఇజ్జత్‌ను తగ్గిస్తుంది. పోరాట యోధుడిగా రేవంత్‌కు మంచి పేరుంది. వర్షం పడకపోవటానికి శాస్త్రీయ కారణం చూడాలి.మేఘ మదనం వలన మేఘాలను రప్పించి వాటికి చల్లదనం కలిగిస్తే వర్షం పడుతుంది. అది శాస్త్రీయం.ఈ యాగాలు అన్ని కొంతమంది పూజారులు,పురోహితులకు జీవనాధారమైపోయింది.వాళ్ళుఏది చెబితే దాన్ని నమ్మీ ప్రజాధనం దుర్వినియోగం చేయటం తగదు.ఆర్టికల్ 51 హెచ్‌లో వ్రాసుకున్నట్లుగా శాస్త్రీయ భావాలను ప్రభుత్వాలు పెంచాలి. అనాగరికమైన యజ్ఞాలు, యాగాలు చేయటం ప్రభుత్వాలు మానుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం

## తస్మాత్ జాగ్రత్త

రెండున్నరేళ్ల క్రితం తెలంగాణలో కెసిఆర్ ఆ వెంటనే ఎపిలో జగన్ ఢిల్లీలో కేజ్రీవాల్, ఈ మధ్య పినరయి విజయ్,మమత,స్టాలిన్ఎన్నికల్లో పరాజయంపాలై పదవీచ్యుతులు అయ్యారు.వారుచేసిన అవినీతిపనులు, అహంకార ప్రవర్తనే వారి ఈ ఘోర పరాజయానికి కారణం. ఇప్పుడుపాలన చేస్తున్నముఖ్యమంత్రులు తమకి అలాంటి పరాజయ పరిస్థితులు రాకుండా చూసుకోవాలి.

-మిథునం, హైదరాబాద్

## ఉత్తర్వులు సమంజసంగా లేవు!

దశాబ్దాలుగా మనం కావేరీ సంక్షోభాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వేసవిలో, తమిళనాడులో పంటలకు నీరు లేదని చెబుతూ, కావేరీ జలనిర్వహణ అథారిటీ లేదా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. మా మూడో పంట కూడా ఎండిపోతోంది,నీటిని విడుదల చేయమని చెప్పే తమిళనాడు ప్రభుత్వానికి, కర్ణాటకలో రెండే పంటలు పండినా అవి ఎండిపోయినా పర్వాలేదనే మనస్తత్వంలా కనిపిస్తుంది. ప్రస్తుతం, వర్షాలు లేకపోవడం వల్ల కర్ణాటక పై కరవు నీడ పడింది.రాబోయేరోజుల్లో ప్రజలు,పశువులు తాగునీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా బెంగుళూరు నగరం కూడా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఎదురుక్కునే పరిస్థితులురావచ్చు అనేకథనాలు పత్రికల్లో వస్తున్నాయి. రెండు రాష్ట్రాల జలవనరుల పరిస్థితి గురించి అథారిటీ కి తెలుసు. అయినప్పటికీ, జలాశయాలలో ఉన్న కొద్దిపాటి నీటి నుండి తమిళనాడుకు నీటిని విడుదలచేయమని ఆదేశించడం సమంజసం కాదు. ఈ ఉత్తర్వులను పునః పరిశీలించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భారత్, బంగ్లా స్నేహసంబంధం

ఫ్రాన్స్ మీడియా సంస్థతో ఇచ్చిన ఇంటర్వ్యూ లో బంగ్లా మాజీ ప్రధానిషేక్ హసీనాతిరిగి వెళ్లడం ఒక చర్చనీయాంశం. ఆశ్రిత పక్షపాతం ఉండడం, అవినీతి ఆరోపణలు మూలంగా విద్యార్థుల నిరసన ఎదుర్కోవడం వల్ల భారత్‌కు ఆశ్రయానికి వచ్చిన హసీనాకు భారత్ ఆపన్న హస్తం చాచింది. అయితే దీనివెనుక భారత్, బంగ్లా మధ్య ఉన్న స్నేహ సంబంధాలతో పాటు పాకిస్థాన్ దాష్టికాలకు వ్యతిరేకంగా భారత్ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సంపాదించడంలో 1971లో పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా యుద్ధం కూడా చేసింది మర్చిపోకూడదు. భారత్ బంగ్లామధ్య స్నేహ సంబంధాలను ఎంతమాత్రం చెడగొట్టాలేకపోయాయి.భారత్,బంగ్లాదేశ్ మధ్యఉన్నది కేవలం స్నేహ సంబంధాలు మాత్రమే కాదు. ఈ రెండుదేశాల మధ్య ఉన్నది మిశ్రమ సంస్కృతి, లౌకికసంస్కృతి, అని గుర్తుపెట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## మార్పులు జరగటం సహజం

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, చట్టసభ సభ్యులు ఎప్పుడూ ఒకరే ఉండరు. ఐదు సంవత్సరాలు కాకపోతే 10 సంవత్సరాలు. అదీకాకపోతే 20సంవత్సరాలు. మరి కొందరు 30 సంవత్సరాలు కూడా పదవుల్లో ఉంటారు. ఆ తరువాత మరొకరు వారి స్థానంలోకి వస్తారు. తప్పదు. దీన్ని అర్థం చేసుకుని హుందాగా వ్యవహరించాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పేరు మారితే మహిళల 'దిశ' మారుతుందా?

**చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడంసమస్యకు మూలపరిష్కారం కాదు. దిశబిల్లు వెనక్కి వెళ్లింది. రేపు మరో ప్రభుత్వం మరో పేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు. కానీ మహిళల జీవితాల్లో భయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షి ంచాల్సివస్తే, దళిత,ఆదివాసీ, బీసీ,మైనారిటీ, పేదమహిళలపై జరిగేహింస జాతీయ చర్చగా మారకపోతే,ఈ దేశానికి సమస్య చట్టాల కొరత కాదు. రాజకీయ చిత్తశుద్ధి కొరత. పరిపాలనా సంకల్పం కొరత. సామాజిక న్యాయం కొరత. దిశబిల్లు వెనక్కి వెళ్లిందా లేదా అనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది.**



పాపని నాగరాజు

ప్రతి అత్యాచారం తర్వాత ఒక కొత్త చట్టం వస్తోంది. ప్రతికొత్త చట్టం తర్వాత మరో అత్యాచారం కూడా జరుగుతోంది. మారేది చట్టాల పేర్లు మాత్రమే. మహిళల జీవితం కాదు. ప్రజల్లో ఆగ్రహం చెలరేగితే ప్రభుత్వాలు కొత్త చట్టాలను ప్రకటిస్తాయి. మీడియా వాటిని సంచలనంగా చూపిస్తుంది. రాజకీయ పార్టీలుమహిళల భద్రతపై పోటీగా ప్రకటనలు చేస్తాయి. కొద్దిరోజులకు ఆ ఆగ్రహం చల్లారిపోతుంది. చట్టం ఫైళ్లలో పడిపోతుంది. ఇదే చక్రం మళ్లీ తిరుగుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ బిల్లును ఉపసంహరించుకుంది. ఇది ఒక పరిపాలనా నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, అధికార కేంద్రీకరణ, పితృస్వామిక, నిర్లక్ష్యం సామాజిక అసమానతలు ఒకే చోట కలిసిన నిర్ణయంగా కనిపిస్తుంది. అసలు ప్రశ్న దిశ బిల్లు గురించికాదు. దిశ బిల్లు వెనక్కి వెళ్లింది. మహిళల దశ మారిందా? 2019లో హైదరాబాద్‌లో ఒక యువ పశువైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. ఆ ఘటనపై వెల్లువెత్తిన ప్రజా ఆగ్రహానికి రాజకీయ ప్రతిస్పందనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది.అత్యాచార కేసులదర్యాప్తు, విచారణను వేగవంతం చేయడం, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు అమలు చేయడం వంటి లక్ష్యాలతో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఇది ఒక్కసారిగా పుట్టిన ఆలోచన కాదు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. దాని ఫలితంగా 2013లో నేరచట్టాల్లో కీలక సవరణలుజరిగాయి. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చింది. ప్రతి దారుణ ఘటన తర్వాత ఒక కొత్త చట్టం వచ్చింది. కానీ ఒక్కసారి కూడా మనం ఒక ప్రశ్నను గంభీరంగా అడగలేదు. ఇప్పటికే ఉన్న చట్టాలు ఎందుకు విఫలమయ్యాయి? చట్టాలు మారాయి. శిక్షలు కఠినమయ్యాయి. నేరాల నిర్వచనాలు విస్తరించాయి.అయినప్పటికీ మహిళలపై హింస తగ్గలేదు. దీనర్థం సమస్య చట్టాల కొరతలో లేదని, చట్టాలను అమలు చేసే వ్యవస్థలోనే ఉందని స్పష్టమవుతోంది. ఇక్కడ మరో వాస్తవాన్ని కూడా గుర్తించాలి. ప్రతి మహిళపై జరిగిన దారుణం ఒకేస్థాయిలో ప్రజాస్పందన పొందదు. ప్రతి బాధితురాలికి ఒకే స్థాయిలో రాజకీయ అండ, మీడియా దృష్టి, సామాజిక సంఘీభావం దక్కదు. నిర్భయ ఘటన దేశ రాజధానిలో జరిగింది.కానీ గ్రామాల్లో, అట్టడుగు వర్గాల్లో, శ్రామిక కుటుంబాల్లో, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ మహిళలపై నిత్యం జరిగే హింసలో ఎక్కువ భాగం జాతీయ చర్చగామారదు. చట్టాలు ప్రజాఆగ్రహం నుంచి పుడతాయి. కానీ ఏఆగ్రహం చట్టంగా మారుతుంది? ఏ బాధ మౌనంగా మిగిలిపోతుంది? అనే ప్రశ్నకు సమాధానం మన సామాజిక నిర్మాణంలోనే దాగి ఉంది. ప్రియాంక రెడ్డి ఒక మహిళ కనుక దేశమంతా స్పందించింది. అదే తీవ్రతతో, అదే వేగంతో, అదే రాజకీయ సంకల్పంతో దళిత,ఆదివాసీ, బీసీ, మైనారిటీ,పేద మహిళలపై జరిగే అత్యాచారాల విషయంలో ఎందుకు స్పందించరు? ఈప్రశ్న తర్వాత అనేక దళిత, బహుజన సంఘాలుకూడా ఇదే అంశాన్ని బహిరంగంగా చర్చించాయి. హత్రాస్‌లో దళిత యువతిపై జరిగిన అత్యాచారం, బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన నిందితుల విడుదల చుట్టూచెలరేగిన వివాదం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన ఒకే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. చట్టం అంద రికీ ఒకటే కావచ్చు. కానీ న్యాయం అందరికీ ఒకే వేగంతో, ఒకే తీవ్రతతో అందడం లేదు. బాధితురాలి కులం, వర్గం, ప్రాంతం, రాజకీయ పరిస్థితి కూడా న్యాయవ్యవస్థ స్పంద నను ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు యాదృచ్ఛికంగా రావడం లేదు. 2019



డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన దిశ చట్టం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపబడింది. అక్కడే అది ఐదేళ్లకు పైగా నిలిచిపోయింది. నేర చట్టాలు ఉమ్మడి జాబితాకు చెందిన అంశం కావడంతో రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కేంద్ర హోంశాఖ పలు నిబంధనలపై వివరణలుకోరింది. ఫైళ్లు కదిలాయి.కానీ చట్టం ముందుకు కదల్లేదు. ఈ ఐదేళ్లలో ఎంతమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు?ఎన్ని కుటుంబాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగాయి? ఎంతమంది బాధితులు పోలీస్ స్టేషన్ గుమ్మం దాటలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రభుత్వాలు లేవు. చట్టం పెండింగ్‌లో ఉన్నంతకాలం ప్రజలకు ఇచ్చినహామీ కూడా పెండింగ్‌లోనే ఉంది.వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేయడం వరకు తన బాధ్యతను నిర్వర్తించింది. కానీ రాష్ట్రపతి ఆమోదం కోసం అవసరమైన రాజకీయ, న్యాయ పోరాటాన్ని కొనసాగించ లేకపోయింది. మరోవైపు కేంద్రప్రభుత్వం వివరణల పేరుతో ఫైళ్లను నిలిపివేసింది. ఫలితంగా రాజకీయాలు సాగాయి. పరిపాలనా ప్రక్రియ కొనసాగింది.కానీ న్యాయం మాత్రం వేచిచూసింది. ఇప్పుడు ఎందుకు ఉపసంహరించుకున్నారు? భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత అమల్లోకి వచ్చాయని, మహిళలు, చిన్నారుల రక్షణకు అవసరమైన అనేక నిబంధనలు కొత్త కేంద్ర చట్టాల్లోనే ఉన్నాయని చెబుతూ దిశ బిల్లును ఉపసంహరించుకుంది. కానీ ఇక్కడితో చర్చముగియదు. అదే మంత్రివర్గ సమావేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం, అమరావతి ఐ ప్రాజెక్టు వంటి పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు వేగంగా ఆమోదం పొందాయి. మహిళల భద్రతకు సంబంధించిన చట్టంమాత్రం ఐదేళ్లు ఫైళ్లలో తిరిగి చివరకు ఉప సంహరణకు గురైంది. మహిళల భద్రతకు సంబంధించిన చట్టం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. కానీ పెట్టుబడిదారులకు సంబంధించిన నిర్ణయాలు ఒకే సమావేశంలో ఆమోదం పొందుతాయి. ఇది యాదృచ్ఛికం కాదు. పాలక వ్యవస్థకు ఏఅంశాలు అత్యవసరమో, ఏ అంశాలు వేచి ఉండవచ్చో తెలిపే రాజకీయ ప్రాధాన్యతల క్రమం.అభివృద్ధి అంటే పెట్టుబడుల ప్రవాహమేనా? లేక మహిళలు భయం లేకుండా జీవించగల సమాజాన్ని నిర్మించడమూ అభివృద్ధేనా? అనే ప్రశ్నకు ప్రభుత్వం తన నిర్ణయాలతోనే సమాధానం చెబుతోంది. దిశబిల్లును ఉపసంహరించుకున్న ప్రభుత్వం, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మరింత సమగ్రంగా రూపొందించిన ప్రత్యామ్నాయ చట్టాన్ని ఇప్పటివరకు తీసుకురాలేదు. 'కొత్త కేంద్ర చట్టాలే సరిపోతాయి' అనడం పరిపాలనా సమాధా నం కావచ్చు. కానీ మహిళల భద్రత విషయంలో రాష్ట్రానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన బాధ్యత అక్కడితో ముగిసిపోదు. ప్రతిదారుణ ఘటన తర్వాత చట్టాలను మరింత కఠినత రం చేయాలనే డిమాండ్ వస్తుంది. ప్రతి ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని ఎంచుకుంటుంది. కానీ చరిత్రమరో వాస్తవాన్ని చెబుతోంది. నేరాలను ఆపేది శిక్ష తీవ్రతకాదు. నేరం చేసినవాడు తప్పకుండా పట్టుబడతాడనే భయం. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందనే విశ్వాసం. విచారణఆలస్యం కాదనే నమ్మకం.శిక్ష తప్పదనే పరిపాలనా సామర్థ్యం. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడానికే రోజులు పట్టినా, ఫోరెన్సిక్ నివేదికలు నెలలతరబడి ఆలస్యమైనా, ప్రత్యేక కోర్టులు తగినంత లేక కేసులు సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్నా, అత్యంత కఠినమైన చట్టం కూడా పుస్తకాలకే పరిమితమవుతుంది. చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడం సమస్యకు మూలపరిష్కారం కాదు. దిశ బిల్లు వెనక్కివెళ్లింది. రేపుమరో ప్రభుత్వం మరోపేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు.కానీ మహిళల జీవితాల్లోభయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సివస్తే, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేద మహిళలపై జరిగే హింస జాతీయ చర్చగా మారకపోతే, ఈ దేశానికి సమస్య చట్టాల కొరతకాదు.రాజకీయ చిత్తశుద్ధి కొరత, పరిపాలనా సంకల్పం కొరత, సామాజిక న్యాయం కొరత. దిశ బిల్లు వెనక్కి వెళ్లిందా లేదాఅనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది.

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలకు అంతం లేదా?

కామిడి సతీష్ రెడ్డి

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీవారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగాఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10మందితో సంఘాలు ఏర్పాటు చేయిం చి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రోరుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు.దీంతోపలు వురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతికిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులోఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణగ్రహితలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణచెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రోరుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థికభారం మరింత పెరుగుతోంది. ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి.

# పాదచారుల భద్రత అభివృద్ధికి సంకేతం



డాక్టర్ ఎ. భాగ్యరాజ్

ఒక దేశం, ఒక నాగరిక సమాజం, ఒక నగరం ఎంత వెడల్పైన రోడ్లు కలిగి ఉందో కాదు, పాదచారులు ఎంత సురక్షితంగా, గౌరవంగా నడవగలుగుతున్నారో అదే నిజమైన అభివృద్ధికి కొలమానం. దానిలో భాగంగా పాదచారులభద్రత అనేది ఒక అభివృద్ధి చెందిన దేశానికి అత్యంత ముఖ్యమైన ప్రమాణాల్లో ఒకటి. రహదారులు కేవలం వాహనాల కోసం కాదు, నడిచే ప్రజల కోసం కూడా సమానంగా ఉండాలి. సుప్రీంకోర్టు కూడా సురక్షితమైన ఫుట్పాత్పై నడవడం అనేది జీవించే హక్కు (ఆర్టికల్ 21)లో భాగమని పేర్కొంటూ కేంద్ర, రాష్ట్రాలు పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పాదచారుల మార్గం లేని ప్రాంతంలో పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండగా ట్యాంకర్ ఢీకొని మరణించిన ఐదేళ్ల బాలుడికి సంబంధించిన ఒక కేసులో జూన్ 19, 2026 న తీర్పు నుండి ఉద్భవించింది. ఆగస్టు 3న, 2026, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, అదనపు సొలిసిటర్‌జనరల్ ఆదేశాలను పాటించేలా చూడాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వు జారీచేసింది. ఆక్రమణలకు గురికాని, పూర్తిగా వేరుచేసిన స్థలాన్ని ప్రతి రహదారి ప్రక్కన పాదచారుల కోసం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రహదారి ఉందంటే పాదచారుల నడకదారి కూడా అందులో ఉన్నట్టే కదా, దీనికోసం పెద్దఎత్తున డబ్బులు ఖర్చుపెట్టి, భారీగా నిర్మాణాలు ఏమి చేయనక్కర్లేదు కదా, రహదారి నుంచి నడకస్థలాన్ని వేరుచేసే ఏర్పాటు ఉంటేసరిపోతుంది, ఆ స్థలం దురాక్రమణకు గురి కాలేదని చెప్పడానికి చిన్న తాడు అక్కడ కట్టినా సరిపోతుంది కదా అని బెంచ్ (జస్టిస్‌పి.ఎస్. నరసింహ,జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం) వ్యాఖ్యానించడం శుభపరిమాణం. పాదచారులు కదిలేవాహనాల మధ్య చిక్కుకుపోతామనే భయం లేకుండా నిర్భయంగా నడిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో పట్టణాభివృద్ధి విభాగాలు, మునిసిపల్ కార్పొరేషన్లు,మునిసిపాలిటీలు,పంచాయతీల యంత్రాంగాలదే బాధ్యత అని,బాధితులకు ఈ వ్యవస్థల నుంచి పరిహారం కోరే పూర్తి హక్కు ఉందని స్పష్టం చేసింది. పాదచారుల మార్గాలపై నడిచే ప్రాథమిక హక్కు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు,వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్ 19(1)(డి) (భారతదేశ భూభాగం అంతటా స్వేచ్ఛగాసంచరించే హక్కు) లో అంతర్లీనంగా ఉంది.నడవడం అనేది ఈ స్వేచ్ఛలలో అంతర్భాగం కాబట్టి, ఈ హక్కు ఆర్టికల్ 19(1)(ఎ) (భావ ప్రకటనా స్వేచ్ఛ), ఆర్టికల్ 19(1)(బి) (సమావేశం),ఆర్టికల్ 19(1)(సి) (సంఘం ఏర్పాటు) అంశాలను కూడా తనలో ఇముడ్చుకుంది అని వెలువరించింది. ఈ తీర్పు పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంఘాలు,పురపాలక సంఘాలు పంచాయతీలపై పాదచారుల మౌలిక సదుపాయాలను



సృష్టించడం, నిర్వహించడం పరిరక్షించడం అనే అనుబంధ బాధ్యతను విధిస్తుంది. పాదచారుల హక్కులను పరిరక్షించడానికి, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఒక నిర్దిష్ట చట్టాన్ని రూపొందించాలని, అలాగే ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాదచారుల భద్రత, సార్వత్రిక ప్రాప్యత పాలసీ2026 అనే విధానంతో రోడ్లపై నడిచే ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను రక్షించడానికి వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకువచ్చిన ఒక చారిత్రాత్మక పాలసీకి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ముఖ్య ప్రాముఖ్యత, ఉద్దేశాలు భారతదేశంలో ఏటా వేలాది మంది పాదాచారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పాలసీ ద్వారా వాహనదారుల కంటే రోడ్డుపై నడిచే వారికే మొదటి ప్రాధాన్యత లభిస్తుంది.రోడ్డు ప్రమాదాల నివారణ భద్రతకు ప్రాధాన్యతనిస్తుంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడానికి రోడ్లపై శాస్త్రీయంగా భద్రతా తనిఖీలు నిర్వహిస్తారు. ఆక్రమణలు లేని ఫుట్పాత్లు స్పష్టమైన విభజనకు అవకాశముంటుంది. ఫుట్పాత్లను ఆక్రమించి దుకాణాలు పెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నడిచే దారి ఎల్లప్పుడూ ఖాళీగా ఉండేలా చూస్తారు.ఈ పాలసీ కేవలం సాధారణ ప్రజలకే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు గర్భిణీ స్త్రీలకు కూడా సురక్షితంగా నడిచేలా అందరికీ వీలు కల్పిస్తుంది. ఫుట్పాత్లపై వీల్చైర్లు వెళ్లేందుకు వీలుగా రాంప్లు, అంధులు నడవడానికి వీలుగా స్పర్శ మార్గాలు ఏర్పాటు చేయబడతాయి. స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు తమ పరిధిలోని ఫుట్పాత్లను సంరక్షించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే పౌరులు కోర్టుల ద్వారా నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది. కాబట్టి నిఘా, జవాబుదారీతనం అధికారులదే బాధ్యత. పాదాచారుల మార్గాల్లో భద్రత కోసం నిఘా కెమెరాలు, స్మార్ట్ క్రాసింగ్లను ఏర్పాటు చేస్తారు. సురక్షితమైన దారులు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు స్వల్ప దూరాలకు నడవడానికి ఇష్టపడతారు. నడక పెరగడం వల్ల వాహనాల వాడకం తగ్గి, పట్టణాలలో వాయుకాలుష్యం,ట్రాఫిక్ జామ్లు తగ్గుతాయి. మొత్తంగా చెప్పాలంటే, పాదాచారుల పాలసీ 2026 అనేది కేవలం రోడ్ల నిర్మాణానికి సంబంధించింది కాదు, ఇది నగరాలను యంత్రాల కోసం కాకుండా, మనుషుల కోసంమార్చే ఒక గొప్ప సంస్కరణ. నియమాలు ఉన్నప్పటికీ ప్రజలు, స్థానిక సంస్థలు, ట్రాఫిక్‌శాఖ,రోడ్లుభవనాల శాఖల మధ్య సమన్వయం లోపం ఎక్కువగా, అమలు లోపం ఉంది.యూరప్లో చాలాదేశాలు (నెదర్లాండ్స్,డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, ఫ్రాన్స్ మొదలైనవి) పాదచారులకు ప్రాధాన్యం ఇచ్చే నగర రూపకల్పనను అనుసరిస్తున్నాయి. మన దేశంలో కూడా ప్రతి 200-300 మీటర్లకు సురక్షిత క్రాసింగ్ ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద వేగ పరిమితిని 30కి.మీ./గం.కు పరిమితంచేయాలి. పట్టణ స్థానిక సంస్థల పనితీరును 'పాదచారుల భద్రత' ఆధారంగా కూడా అంచనా వేయాలి. ప్రతి కొంత దూరానికి బెంచీలు, నీడకోసం చెట్లవరుస,తగిన వీధి దీపాలు, వర్షపు నీరునిల్వ కాకుండా సరైన డ్రైనేజీ, పాదచారులు దాటే చోటఎత్తుగా నిర్మించిన క్రాస్వాక్లు,పిల్లల స్ట్రోలర్లు, వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ప్రయాణించేలా అడ్డంకులు లేకుండా నిర్మాణం, సైకిల్ ట్రాక్ వేరుఉండే సౌకర్యాలు ఉండాలి.

# 'జెన్‌జెడ్'ను తప్పుదారిపట్టించారు..

## నీట్ లీకేజీలపై తొలిసారి గళం విప్పిన కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్రప్రధాన్

## భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టేది యువతే



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా జెన్‌జెడ్ యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో గతనెల 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండువారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు,అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు. జెన్‌జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నారని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యంకాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు.మరొక సభలో మాట్లాడుతూ ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, ధర్మేంద్ర ప్రధాన్ గోబ్యాక్‌నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు.ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తావిస్తూ తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పనిచేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజలనుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్ర మేమిటంటే బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.



# పేపర్ లీక్ ఆందోళనపై దిగివచ్చిన జార్ఖండ్ సర్కార్

## పరీక్షల రద్దుకు సుముఖమని తెలిపిన మంత్రి

**రాంచి, ఆగస్టు 9:** పేపర్ లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి జార్ఖండ్ సర్కార్ దిగొచ్చింది. సోమవారం జార్ఖండ్ అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం మరోసారి విద్యార్థులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. అయినప్పటికీ జెపిఎస్‌సి జెఎస్ఎస్‌సిజడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సీబీఐ దర్యాప్తుపై హామీ ఇచ్చేంత వరకు రాజీ ప్రసక్తే లేదని విద్యార్థి నాయకులు తేల్చి చెప్పారు. విద్యార్థులతో జరిగిన చర్చల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 14వ జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడం, పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై దర్యాప్తు చేయడం, నియామక ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావడం వంటి ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనల్ని విద్యార్థులు పట్టించుకోవడం లేదు. సీబీఐ దర్యాప్తు లేకుండా చేసే ఇతర దర్యాప్తులు చేయడం, సీజీఎల్ పరీక్షను రద్దు చేయకపోవడం తమ ప్రధాన సమస్యల్ని పరిష్కరించవని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులు చేస్తు డిమాండ్లలో 99 శాతం అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు. మూడు రోజుల చర్చల తర్వాత 14వ జెపిఎస్‌సిపరీక్షతో పాటు 202325 బ్యాక్‌లాగ్ నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రెండు దిశల్లో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సీఐడీ దర్యాప్తు చేస్తుందని, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ దర్యాప్తు కోరుతామని మంత్రి తెలిపారు. నిందితులపై 90 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్ నియామకాలపై నిపుణులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.

# వెస్ట్‌బ్యాంక్‌తో పాలస్తీనా ఏర్పాటును తిరస్కరించిన నెతన్యాహు




**జెరూసలెం, ఆగస్టు 9:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తిరస్కరించారు. ఆయన గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌తో పాలస్తీనా దేశం ఏర్పాటును తోసిపుచ్చారు. 15 అంశాల గాజా పీస్ ప్లాన్‌ను ఆదివారం తిరస్కరించారు. ట్రంపునకు ఇది ఎదురుదెబ్బగా మారింది. తాను ప్రధానిగా ఉన్నంత కాలం, పాలస్తీనా దేశం ఉండదు అని నెతన్యాహూ అన్నట్లు ఇజ్రాయిల్ మీడియా నివేదించింది. గాజా ప్లాన్‌ను తిరస్కరించడంతో పాటు హమాస్ పూర్తిగా నిరాయుధమయ్యే వరకు ఇజ్రాయిల్ గాజా నుంచి వెళ్లేదే లేదని తేల్చి చెప్పారు. ఈ రోడ్ మ్యాప్‌ను ట్రంప్ కీలక మైలురాయి, గొప్ప పురోగతిగా అభివర్ణించిన వారం రోజుల తర్వాత నెతన్యాహూ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇదిలా ఉంటే, ఈ ప్రణాళికకు హమాస్ అంగీకరించింది. శాంతి ప్రణాళిక అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని హమాస్ కోరింది. ఈ ప్రణాళికలో భాగంగా తదుపరి దశకు వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ బోర్డ్ ఆఫ్ పీస్‌కు హమాస్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇజ్రాయిల్ తీరుపై ముస్లిం దేశాలు విమర్శలు చేస్తున్నాయి. వారం రోజుల క్రితం యూఏఈతో పాటు ఏడు ముస్లిం దేశాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్యను తీవ్రంగా విమర్శించాయి. ఇజ్రాయిల్ చర్యలు గాజా యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.



# రాహుల్ ప్రయాగరాజ్ పర్యటనపై కేంద్రమంత్రి ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ వెళ్లే బదులు రాంచీకి వెళ్లి ఉండాల్సిందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. రాహుల్ ఓపెద్ద తప్పు చేశారని, అయితే మనుషులన్నాక తప్పులు చేయడం సహజమే నంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడంపై కేంద్రం, విపక్షాల మధ్య నడుస్తున్న వివాదం నేపథ్యంలో ఈ చర్చ జరిగింది.మహిళల భావ ప్రకటన స్వేచ్ఛపై రాహుల్ గాంధీ షేర్‌చేసిన ఒక వీడియోపై రిజిజు స్పందిస్తూ,ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరడంతో ఈ రగడ మొదలైంది.దీనికి ప్రతిగా, అసలు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు లంకె పెడుతున్నారంటూ రాహుల్ గాంధీ నిలదీశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాహుల్ గాంధీ అక్కడి ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై,దాని విధానాలపై విరుచుకుపడ్డారు.కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో నేడు యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. తన ప్రసంగంలో ప్రధానంగా మూడు అంశాలపై మాట్లాడాలనుకుంటున్నట్లు రాహుల్ తెలిపారు. అవి – బాధ, డేటా, సంపద. యువత పడుతున్న బాధలు, వారు ఉత్పత్తి చేస్తున్న డేటా గురించి తాను మాట్లాడుతున్నానని, అయితే అసలు సమస్య ఏమిటంటే.. యువతకు చెందాల్సిన సంపద ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా వారికి అందడం లేదని అన్నారు.

# జేడీ వాన్స్‌తో ప్రధాని మోడీ ఫోన్ చర్చలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్‌అమెరికా మధ్య ఉన్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు ఇటీవల కుమారుడు జన్మించినందుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. వాన్స్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికఎక్స్‌లో స్పందించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నుంచి ఫోన్ కాల్ అందుకుంది. భారత్‌అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కీలక రంగాల్లో మరింత లోతుగా తీసుకెళ్లే మార్గాలపై చర్చించాం. ఆయనకు, సెకండ్ లేడీ ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. మొత్తం కుటుంబానికి శుభాకాంక్షలని మోడీ పేర్కొన్నారు. ఈ ఫోన్ సంభాషణకు కొద్ది రోజుల ముందు భారత్‌లో విదేశీ విరాళాలకు సంబంధించిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టంలో ప్రతిపాదిత సవరణలపై అమెరికా చట్టసభ్యుడు రైలీ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌జీవోలు, ట్రస్టులు, విద్యా సంస్థలు, మత సంస్థలు విదేశాల నుంచి స్వీకరించే విరాళాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు తీసుకురావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతిపాదిత మార్పుల ద్వారా భారత ప్రభుత్వం చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలపై నియంత్రణ సాధించే అవకాశం ఉందని రైలీ మూర్ ఆరోపించారు. దీనిని క్రైస్తవులపై స్పష్ట మైన దాడిగా అభివర్ణించారు. మరోవైపు భారత్‌అమెరికా ఆర్థిక సంబంధాలు కూడా కీలక దశలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే రష్యా ఆంక్షల బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదిం చింది. ఈ బిల్లులో రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ కూడా ఉండటంతో ఈ పరిణామం న్యూఢిల్లీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ బిల్లు చట్టంగా మారాలంటే అమెరికా ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందాల్సి ఉంది. ఇదే సమయంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి.

# పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదుల హత్యలు, అనుమానాస్పద మరణాలు కొనసాగుతూనే వున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో దారుణాలకు పాల్పడుతూ పాక్‌లో తలదాచు కుంటున్న లష్కర్ ఏ తయ్యిబా, హిజ్బుల్ ముజహిద్దీన్ వంటి సంస్థల ఉగ్రవాదులు గడచిన నాటుగేళ్ల కాలంలో 30 మందికి పైగా హత్యకు గురవడం పాక్‌లో సంచలనం రేపింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద లష్కర్ ఓ తయ్యిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా వున్న జమాత్ ఉద్ దవా సీనియర్ కమాండర్ ఖారీ సయ్యిద్ అబ్దుల్ అజీజ్ వున్నట్లుండి కుప్పకూలి పోయాడు. అంతకు ముందు సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ఇతను భోజనం చేసినట్లు సన్నిహితులు చెబుతున్నారు. కుప్పకూలగానే అజీజ్‌ను సహచరులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడు. అజీజ్ విష ప్రయోగంవల్ల మరణించి వుంటాడని అనుమానిస్తున్నారు. 30ఏళ్ల అజీజ్ ఇస్లామాబాద్‌కు చెందిన వాడుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇతనిపై జమ్మూ కాశ్మీర్‌లో అనేక కేసులున్నాయి. కాగా జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడే ఉగ్రవాదుల కు అజీజ్ అటు ఆక్రమిత పాక్ ఇటు కాశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో షెల్టర్లు అందించే వాడు. తప్పుడు పత్రాలతో ఉగ్రవాదులను భారత్‌లో పంపించేవాడు. ఇందుకోసం నీలం వ్యాలీ, ముజఫరాబాద్ మార్గాన్ని ఎంచుకునే వాడు. ఇదే సమయంలో ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అజీజ్ అందించేవాడు.



# చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుఫాన్

## షాంఘైలో జనజీవనం అస్తవ్యస్తం

### 1,300కు పైగా విమాన సర్వీసులు రద్దు

**బీజింగ్, ఆగస్టు 9:** పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అత్యంత తీవ్రమైన 'డాల్ఫిన్' తుఫాన్ చైనా తూర్పు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులతో దూసుకొస్తున్న ఈ తుపాను దెబ్బకు దేశ వాణిజ్య రాజధాని షాంఘై సహా పలు ప్రధాన నగరాలు స్తంభించిపోయాయి. చైనా ప్రభుత్వం ఇప్పటికే బ్లూ అలర్ట్ జారీ చేసి, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుఫాన్ ప్రభావం షాంఘై, జెజియాంగ్ ప్రావిన్సులపై తీవ్రంగా పడింది. ముందుజాగ్రత్త చర్యగా షాంఘైలోని హాంకియావో, పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆదివారం నాటికి 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇది మొత్తం రాకపోకల్లో 60 శాతానికి సమానం. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, జెజియాంగ్, షాంఘై ఓడరేవులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు యాంగ్జీ నదీ పరీవాహక ప్రాంతంలో నడిచే పలు రైళ్లు, పడవల సేవలను కూడా నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ నగరం, షాంఘై పరిసర లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 3.90 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతాల్లోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. చైనా తీరాన్ని తాకడానికి ముందే ఈ డాల్ఫిన్ తుఫాన్ జపాన్‌లోని ఒకినావా దీవులు, తైవాన్ ఉత్తర ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రానున్న రోజుల్లో ప్రభావిత ప్రాంతాల్లో 200 నుంచి 400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన తుపానుల్లో ఒకటిగా పరిణమించే ప్రమాదం ఉందని చైనా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## పెళ్లయిన ఏడేళ్లలోపు వేధింపులతో భార్య మరణిస్తే

# అది వరకట్న హత్యే: అలహాబాద్ హైకోర్టు తీర్పు

**లక్నో, ఆగస్టు 9:** వివాహితల అనుమానాస్పద మరణాలు, వరకట్న వేధింపుల కేసులకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఎవరైనా మహిళ అత్తగారింట్లో అసహజ రీతిలో మరణిస్తే ఆమెపై కట్నం కోసం వేధింపులు జరిగినట్లు ఆధారాలు ఉన్నట్లయితే దానిని 'వరకట్న హత్య'గానే పరిగణించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో సదరు మహిళ మృతికి భర్త లేదా అత్తింటి వారి ప్రమేయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యాలు గానీ, ఆధారాలు గానీ ప్రత్యేకంగా చూపించాల్సిన అవసరం లేదని ధర్మాసనం



వ్యాఖ్యానించింది. వరకట్న హత్యకు సంబంధించిన ఒక అప్పీలు పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ కీలకమైన విషయాలను వెల్లడించింది. 2010లో ఓ మహిళ అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే అది పూర్తిగా వరకట్న హత్యేనంటూ పుట్టింటి వాళ్లు ఆమె భర్త సందీప్ సింగ్ హోరాపై కేసు పెట్టారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన దిగువ కోర్టు అతడిని దోషిగా తేలుస్తూ 2018లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే బాధితురాలు తన అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో అసహజ మరణానికి గురైందని, ఆమె మృతి వెనుక వరకట్న వేధింపుల కోణం ఉందని హైకోర్టు కూడా ప్రాథమికంగా అంగీకరించింది. అయితే ఈ కేసులో దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షపై హైకోర్టు జడ్జి కీలకమైన అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. దోషిగా తేలిన భర్త సందీప్ సింగ్ హోరాకు ఏకంగా యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడానికి గల బలమైన కారణాలను లేదా ప్రత్యేకమైన పరిస్థితులను దిగువ కోర్టు తన తీర్పులో సహేతుకంగా పేర్కొన లేకపోయిందని జడ్జి అభిప్రాయపడ్డారు. చట్ట ప్రకారం అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే జీవిత ఖైదు లేదా యావజ్జీవ కఠిన కారాగారాన్ని విధించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. అం తేకాకుండా ఈ ఘటన జరిగి 16యేళ్లు కావడం, నిందితుడి వయస్సు ప్రస్తుతం దాదాపు 40 యేళ్లకు చేరడం, గడచిన 7యేళ్లకు పైగా అతడు జైలులోనే గడపడం, అలాగే అతడి ప్రవర్తనపై ఎలాంటి ప్రతికూల నివేదికలు లేకపోవడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే హైకోర్టు నిందితుడి జీవిత ఖైదు ను 10యేళ్లకు తగ్గిస్తూ ఇప్పటికే అనుభవించిన జైలు కాలాన్ని అందులో మినహాయించాలని ఆదే శించింది. అయితే ఐపిసి సెక్షన్లు 498ఎ, 406, వరకట్న నిరోధక చట్టం లోని సెక్షన్లు 3, 4 కింద అతడిపై ఉన్న దోష నిర్ధారణను హైకోర్టు మార్చ కుండా యథాతథంగా ఉంచింది.

# సంక్షిప్త వార్తలు

## సౌదీ అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి



**రియాద్, ఆగస్టు 9:** సౌదీ అరేబియాలోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడి యర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీడ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పం దనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.

## మమత కారుపై రాళ్లు రువ్విన నిరసనకారులు



**కోల్‌కత్తా, ఆగస్టు 9:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రికి నిరసనసెగ ఎదురైంది. ఆమె ప్రయాణిస్తున్న కారుపై ఆందోళనకారులు దాడిచేశారు. తమపై గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో దాడిచేశారని, ఈ దాడిలో ప్రాణాలు పోయేవే అని మమత ఆరోపించారు. ఈ దాడిని రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ హింసాకాండలో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో టీఎంసీ పార్టీ కార్యకర్త మరణించాడని ఆ పార్టీ బెంగాల్‌లో తీవ్ర నిరసన తెలుపుతోంది.

## బారామతి ఎయిర్‌ఫీల్డ్‌లోనే కుప్పకూలిన మరో విమానం



**బారామతి, ఆగస్టు 9:** మహారాష్ట్ర బారామతి ఎయిర్ ఫీల్డ్‌లో మరో విమానం కుప్పకూలింది. ఆది వారం ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైనింగ్ విమానం రన్‌వే దాటి వెళ్లింది. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదం జరిగిన 7 నెలల తర్వాత మరో ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో విమానం దెబ్బతిన్నప్పటికీ, పైలట్ సురక్షితంగా బయట పడ్డాడు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## బియ్యం స్కాంలో బిజెపి సర్కార్: సౌరభ్ భరద్వాజ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. రూ.22,000 కోట్ల విలువైన రైస్ స్కాంకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆదివారం దీనికి సంబంధించిన ఆరోపణలు చేశారు. పేదప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని, దారి మళ్లించి, భారీ స్కాంకు బీజేపీ సర్కార్ తెరతీసిందని విమర్శించారు.

## నకిలీ గుర్తింపులతో 25 పెళ్లిళ్లు: బిజెపి ఎమ్మెల్యే ఆక్రోశం



**లక్నో,ఆగస్టు 9:** నకిలీ గుర్తింపులతో 25 వివాహాలు చేసుకుని అనేక మంది మహిళలను మోసం చేసిన ఒక వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసేలా తమను మోసగించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేయడంతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సేవత నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ ఆగస్ట్ 6న సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. 2024లో మిశ్రిఖ్‌లోని చంద్రవాల్ ప్రాంతానికి చెందిన అనుజ్ త్రివేది కుమారుడు ప్రఖర్ త్రివేదితో తన కుమార్తె ప్రజు పెళ్లి జరిగినట్లు తెలిపారు.



## ఉధృతమవుతున్న కెనడా కార్చిచ్చు

**టొరంటో, ఆగస్టు 9:** కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి.

# బెయిల్ కోసం క్షుద్రపూజలు

## ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఫొటోతో 'తంత్ర పూజ్ఞ

## నిందితుడు అరెస్ట్, ఫొటో, నిమ్మకాయలు, కుంకుమ, చేప స్వాధీనం



**రాయ్‌పూర్, ఆగస్టు 9:** ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫొటోను ఉపయోగించి 'తంత్ర పూజ్ఞ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని బిలాస్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన బంధువుకు బెయిల్ ఇప్పించే ప్రయత్నంలో భాగంగా అతను ఈ పని చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం మధ్య రాత్రి వేళ సిపాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవ్రి గ్రామంలోని శ్మశానవాటికలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని రిషికేశ్ కుమార్‌గా గుర్తించారు. అతను మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈ పూజ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వేళ నలుగురు వ్యక్తులు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడటం గమనించిన గ్రామస్తులు వారిని నిలదీశారు. ఆ తర్వాత ముగ్గురు వ్యక్తులు పారిపోగా, కుమార్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు బిలాస్‌పూర్ ఎస్పీ రజనీష్ సింగ్ తెలిపారు. విచారణలో, కత్తిపోట్ల కేసులో తన బంధువు ప్రియాన్షు బోలే మరికొందరితో కలిసి పోలీసుల అదుపులో ఉన్నాడని నిందితుడు పోలీసులకు చెప్పాడు. విచారణ కోసం కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత, పోలీ సులు శ్మశాన వాటిక నుండి పూజకు సంబంధించిన కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో చేప, నిమ్మకాయలు, కుంకుమ, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ సిన్హా, మరో ఇద్దరు వ్యక్తుల ఫోటోలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫొటోలలో ఒకటి ప్రియాన్షు బోలేది కాగా, మరొకటి కత్తిపోట్ల కేసులోని బాధి తుడిది. శ్మశానవాటికకు వెళ్లే ముందు, బెయిల్ పొందడానికి పూజ చేయవచ్చని చెప్పిన ఒక 'తంత్రిక్ఞ వీడియోను తాము చూశామని కుమార్ పోలీసులకు చెప్పాడు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ జరుగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

## రూ.40,185 కోట్ల పిఎంఎల్ఎ కేసులో

# ఆర్‌కామ్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:**మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద రిలయన్స్ కమ్యూ నికేషన్స్ లిమిటెడ్‌పై ఇడి అనుబంధ చార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టులో దాఖలు చేసినట్లు ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. మార్చి 27నాటి మొదటి ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కొనసాగింపుగా శనివారం ఈ అనుబంధ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును దాఖలు చేశారు. రిల యన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్), గౌతమ్ భైలాల్ దోషి, సతీష్ సేథ్, అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, మరియు ఇతరులను పిఎంఎల్ఎ, 2002లోని సెక్షన్ 4 కింద శిక్షార్హమైన సెక్షన్ 3, సెక్షన్ 3తో కలిపి సెక్షన్ 70 కింద నేరాలకు నిందితులుగా చేర్చినట్లు ఆ ప్రకటన తెలిపింది. నేర కార్యకలాపాల ద్వారా వచ్చిన సొమ్మును రూ. 40,185.55కోట్లుగా నిర్ధారించారు. ఇది, రుణగ్రహీత సంస్థలు కన్సార్టియం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బాండ్‌హోల్డర్లకు చెల్లించడంలో విఫలమైన మొత్తం బకాయి. నిధుల సమీకరణ, వినియోగం, దాచిపెట్టడం, ప్రదర్శించడంలో నిందితుల విభిన్న పాత్రలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో భాగంగా, 1 బిలియన్ డాలర్ల ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి) ద్వారా వచ్చిన సొమ్మును తుది వినియోగానికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కూడా ఉంది.

న్యాయ నిర్ణయాధికార సంస్థ జప్తు చేసి, ధ్రువీకరించిన రూ. 8,078.06 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ఈ ఆస్తులలో న్యూఢిల్లీ, నవీ ముంబై, భువనేశ్వర్, చెన్నై, పుణెలలోని లీజు, స్థిరాస్తులు ఉన్నాయి.



# ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా తలవంచక తప్పదు

## గాంధీభవన్‌లో క్విట్ ఇండియా డేలో ప్రసంగించిన మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** స్వాతంత్ర ఉద్యమంలో క్విట్ ఇండియాది కీలకపాత్ర అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కేంద్రం మొండి వైఖరికి వ్యతిరేకంగా జెన్ జి ఉద్యమం చేస్తుందని అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియాడే కార్యక్రమం జరిగింది. మహేశ్‌గౌడ్ జెండా ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జెన్ జి ఉద్యమ వీరులు క్విట్ ఇండియా ఉద్యమం గురించి తెలుసుకోవాలని సూచించారు.

మన జాతిపిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని మంత్రి నెహ్రూను మరిపించే ప్రయత్నం జరుగుతోందని, రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి క్విట్ చెప్పాల్సిన అవసరం ఉందని మహేశ్‌గౌడ్ తెలియ జేశారు. ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా తలవంచక తప్పదని, 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు జరుగుతుందని అన్నారు. ఓట్ల తొలగింపు అడ్డుకొని అర్హత కలిగిన ఓటును కాపాడుతున్నామని, ప్రజాస్వామ్య పరి రక్షణ కోసం కులవివక్ష లేకుండా పోరాటం చేస్తున్నామని మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

# శ్రీశైలంలో 181.05 టిఎంసిల నీరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు9:** శ్రీశైలం ప్రాజెక్టును ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గినట్లు ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. 2 రోజుల క్రితం 2లక్షల క్యూసెక్కులకు పైగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 44,279 క్యూసెక్కులకు తగ్గిందన్నారు.జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసీలు కాగా, ప్రస్తుతం 181.05 టిఎంసీల నీరు ఉన్నట్లు చెప్పారు. 885 అడుగులకు గానూ ప్రాజెక్టులో 878 అడుగులు నీటి మట్టం ఉన్నట్లు వెల్లడించారు.

# రైతు భరోసాపై సామాజిక ఆడిట్ చేయాలి

## పథకం అమలులో తీవ్ర వ్యత్యాసాలు

## యేడాదికి రూ.2 వేల నుండి 2,500 కోట్ల తేడా

## ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే పొంతన లేని రూ.13 కోట్లు

## ఎర్త్ లీడర్‌షిప్, సస్టైనబిలిటీ కోర్డినేటర్ నరసింహారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** రైతు భరోసా పథకం అమలులో తీవ్ర వ్యవత్యాసాలు ఉన్నాయని, దీనిపై సామాజిక ఆడిట్ చేయించాలని వ్యవసాయ నిపుణులు, సెంటర్ ఫర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టైనబిలిటీ కోర్డినేటర్ డాక్టర్ దొంతి నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రచురించిన గణాంకాల్లో వ్యత్యాలు ఉన్నాయని ఆరోపిస్తూ 2018-19 ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటి వరకూ రైతు భరోసా సొమ్ము పంపిణీపై విభజిత లబ్దిదారుల డేటాతో సహా స్వతంత్ర సామాజిక ఆడిట్ చేయించాలన్నారు. అంతేకాకుండా 2018-19 నుండి రైతు బంధు పేరుతో పథకాన్ని ప్రారంభించినప్పటి నుండి ప్రతీ విడత పంపిణీకి సంబంధం గ్రామ, పంచాయితీ స్థాయి లబ్దిదారుల జాబితాలను కోరుతూ ప్రభుత్వనికి ఇటీవల రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రతీ సీజనుకు లబ్దిదారుల పేర్లు, సర్వే నెంబర్లు, వర్తింప చేయబడిన భూమి విస్తీర్ణం, పంపిణీ చేసిన నగదు మొత్తం చెల్లింపు తేదీతో సహా వివరాలను ఇవ్వాలని కోరారు. 2024-25 వానాకాలం సీజన్ఌలో రైతు, సాగు విస్తీర్ణం, పంపిణీ గణాంకాలు అందుబాటులో లేకపోవడానికి తప్పుపట్టారు. ఈ లోపించిన సమాచారానికి వివరణ ఇవ్వాలని తెలిపారు. గత ఏడాది జనవరి 26న ఈ పథకాన్ని రైతు భరోసా పేరు మార్చాని, అయితే ఆడిట్ ప్రయోజనాల కోసం ఈ రెండు పథకాలను ఒకే రికార్డుగా పరిగణించి సమాజిక ఆడిట్ చేయించాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాల్లో అనేక వ్యత్యాసాలు ఉన్నాయని ఆరోపించారు. వీటిలో 2023-24 వానాకాలం సీజన్‌కు సంబంధించి సేకరించిన లెక్కలకు, ప్రభుత్వం వెల్లడించిన పంపిణీ వివరాలకు మధ్య దాదాపు రూ.13 కోట్లు వ్యత్యాసం కూడా ఉందన్నారు. ప్రభుత్వ అధికారిక పత్రంలోని వివిధ విభాగాలలో ఒకే పథకానికి సంబంధించిన అంకెలు 2023-24 నుండి 2026-27 వరకూ సంవత్సరానికి సుమారు రూ.2 వేల నుండి రూ.2,500 కోట్ల మేర తేడా ఉన్నాయని తెలిపారు. ప్రతీ రైతు సాగు చేసే సగటు భూమి విస్తీర్ణంలో తగ్గుదల ఉందని చెప్పారు. 2018-19 నుండి 2023-24 వరకూ 12 సీజన్లలో ఈ సంఖ్య ప్రతీ రైతుకు 2.1 నుండి 2.7 ఎకరాల మధ్య స్థిరంగా ఉందని, అయితే ఇటీవల రెండు యాసంగి సీజన్లలో ఇది 1.33 నుండి 1.48 ఎకరాలకు పడిపోయిందన్నారు. ఇంకా లోపాలు ఉన్నాయని, వీటన్నింటిపై కాలపరిమితితో కూడిన పంచాయితీ స్థాయి సామాజిక తనిఖీ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానా కార్యదర్శికి రాసిన ఆ లేఖలో కోరారు.

# గేట్ 2027.. 14 నుంచి రిజిస్ట్రేషన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు9:** దేశంలో ఐఐటీలు, ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్, పిహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే గేట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 14 నుంచి సెప్టెంబర్ 21 వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉంది. కొత్తగా రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ పేపర్‌ను చేర్చింది. గేట్ 2027 స్కోర్ రిజల్ట్ వచ్చినప్పటి నుంచి మూడేళ్ల పాటు వర్తిస్తుంది. మరిన్ని వివరాల కోసం గేట్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపింది.

# అంగరంగ వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు

## అమ్మవారికి పట్టువస్త్రసాలు సమర్పించిన మంత్రులు

## బోనమెత్తిన పలువురు ప్రముఖులు

**హైదరాబాద్ (చాంద్రాయణగుట్ట), ఆగస్టు 9, ప్రభాతవార్త :** ఆషాఢ మాసం, చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లోని మహంకాళి దేవాలయాలలో బోనాల సమర్పణ అత్యంత వైభవంగా, భక్తి ప్రపత్తులతో జరిగింది. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా కుటుంబసభ్యులతో కలిసి డప్పు చప్పుల్లతో అమ్మవారికి సాంప్రదాయ బద్ధంగా బోనం సమర్పించారు. తెలంగాణ సంస్కృతిని ఎల్లెడలా చాటారు. 117 యేళ్ల చరిత్రలో తొలిసారిగా లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి దేవాలయంలో బోనాల జాతర ఉత్సవాలను ఆలయ కమిటీ నేతృత్వంలో కాకుండా హైకోర్టు ఆదేశాల మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, పోలీసుల నేతృత్వంలో 118 వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చారిత్రిక నగరంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి దేవాలయం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, హరిబౌలి అక్కన్న,మాదన్న మహంకాళి మందిరంలో ఐట ీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సుల్తాన్‌షాహి జగదాంబ దేవాలయానికి ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉప్పుగూడ మహంకాళి దేవాలయానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేం దర్‌రెడ్డి, గౌలిపుర మాతేశ్వరి భారతమాత, కోటమైసమ్మ దేవాలయానికి క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నల్లపోచమ్మ దేవాల యంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సరోజ దంపతులు, మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు ఆయా ఆలయాల నిర్వాహకులు, వేదపండితులు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

అనంతరం వారు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితులు మంత్రులు, అధికారులకు వేదాశీర్వచనాలు పలికారు. రాష్ట్రంలో సంవృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంట లతో, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖఃసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మను వేడుకున్నట్లు మంత్రులు వెల్లడించారు. అంతకుముందు అంబర్‌పేట్‌లో మంత్రి సీతక్క, లాల్‌దర్వాజాలో మంత్రి కొండా సురేఖ, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, జీహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రియాంక, గాయని మంగ్లి తదితరులు అమ్మవారికి బోనం సమర్పించారు. కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు, హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్, బిసి కార్పొరేషన్ చైర్మన్ జి.నిరంజన్, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపి ఎం.అనిల్ కుమార్‌యాదవ్, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, శాసనసభ్యులు రాజాసింగ్, దానం నాగేందర్, రాకేష్‌రెడ్డి, రాజ్‌ఠాకూర్, ఎండోమెంట్ డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం రంగం, పోతరాజు స్వాగతం, మాతేశ్వరి ఘటాల సామూహిక ఊరేగింపుతో బోనాల ఉత్సవాలు ముగుస్తాయి.



# అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

## బోనాల వేడుకల్లో మాజీమంత్రి కెటిఆర్ సందడి

## హైదరాబాద్‌లో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరా బాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బోనాల వేడుకల్లో పాల్గొ న్నారు. పలు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.ఆదివారం ఉదయం నాంపల్లిలోని ఏడుగుళ్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్.. అనంతరం చార్మినార్ వద్ద ఉన్న భాగ్య లక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఓల్డ్ సిటీలోని బంగారు మైసమ్మ అమ్మవారిని, అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని దర్శించు కున్నారు.

అనంతరం లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్న కేటీఆర్‌కు నిర్వాహకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కేటీఆర్ తెలంగాణ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలకు, అన్న దమ్ములకు బోనాల పండుగ శుభాకాంక్షలు. లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి. అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సంతోషంగా ఉండాలి. హైదరాబాద్‌లో వ్యాపారాలు బాగా సాగాలి అని కేటీఆర్ ఆకాంక్షించారు. తనను బోనాల వేడుకలకు ఆహ్వా నించిన నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తదుపరి మీరాలంమండి మహంకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన కేటీఆర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అంబర్‌పేట్ నియోజకవర్గంలోని మహంకాళి అమ్మవారి ఆలయం, ముషీరాబాద్ రాంనగర్ డివిజన్‌లో రేశం మల్లేష్ నివాసంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న కనకాల కట్ట మైసమ్మ దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో



కేటీఆర్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. బోనాల సందర్భంగా కేటీఆర్ పర్యటించిన ప్రతి ప్రాంతంలో స్థానికులు, భక్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు. పలు ప్రాంతాల్లో ప్రజలు కేటీఆర్‌తో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, అమ్మ వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

# సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

## రాజ్యసభసభ్యుడు వేం నరేందర్‌రెడ్డికి టిఎస్‌సిపిఎస్ఇయు వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్ఈయు) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభు త్వం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సుమారు రూ.20 వేల కోట్లు ఇప్పటికే షేర్ మార్కెట్‌లో పెట్టుబడులుగా ఉన్నాయని ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ప్రతి నెలా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన మరో రూ. 200 కోట్లు షేర్ మార్కెట్ పాలవుతున్నాయని ఆయన వాపోయారు. ఇదివరకే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ప్రకటించిన విధంగా, రాష్ట్రంలో కూడా తక్షణమే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి సాను కూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్య న్యాయమైనదని, దీనిపై ఏఐసీసీ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వీలైనంత త్వరలో రాష్ట్ర ప్రభు త్వం ఈ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటుందని భరోసా కల్పించారు.

# అమ్మవారి ఆలయాల్లో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దంపతులు భాగ్యనగరంలోని పలు ప్రముఖ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీసమేతంగా ఆలయాలకు చేరుకున్న ఆయనకు ఆయా ఆలయాల అర్చకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగరంలో బోనాల ఉత్సవాలు శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఆలయాల వద్ద భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల సందడి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోయగూడెం ఒసి-3, జెవిఆర్ ఒసి-3 బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఎబికెఎంఎస్-బిఎంఎస్ సంఘాల నాయకుల వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 9:** మణుగూరు పికెఓసి-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణికి దక్కేలా చొరవ తీసుకుని, సంస్థకు మరో 50 ఏళ్ల ఆయుస్సు నింపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘాల (ఎబికెఎంఎస్-బిఎంఎస్) నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి యావత్ కార్మిక లోకం ఎప్పుడూ మీ వెంటే ఉంటుందని, మీతో కలిసి నడుస్తుందని తమ కృతజ్ఞతా భావాన్ని చాటు కున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం (మెమొరాండం) అందజేస్తూ, ఏళ్ల తరబడి నిలిచిపోయిన కోయగూడెం ఒసి-3,జెవిఆర్ ఒసి-3 బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించాలని కోరారు. కార్మికులు వివరించిన సమస్యలన్నింటినీ కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఎంతో సావధానంగా, విని ఈ అంశంపై సాను కూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకోవడం వల్ల కొత్త గనులు రాక, ఈ ఏడాది సుమారు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఏర్పడిందని మంత్రికి ఈ సందర్భంగా వివరిం చారు. ప్రైవేట్ పరం చేసిన ఈ బ్లాకుల్లో భూసేకరణ సమస్యలు, చట్టపరమైన వివాదాలు, గిరిజన ఏజెన్సీ నిబంధనల కారణంగా ఇప్పటివరకు ఉత్పత్తి ప్రారంభం కాలేదని స్పష్టం చేశారు.కొత్త గనులు లేక ఇల్లందు ప్రాంతంలో కార్మికుల బదిలీలు జరుగుతున్నాయని, స్థానిక ఉపాధి, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులు, యంత్రాలు, రవాణా వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, బొగ్గు ఉత్పత్తి పెరిగి దక్షిణ భారత విద్యుత్ కేంద్రాలకు నిరంతర సరఫరా బలోపేతం అవుతుందని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, స్థానిక ప్రజలకు ఉపాధి దక్కుతుందని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేటాయింపులపై సమగ్ర సమీక్ష జరిపి, అవసరమైతే డీఅలోకేషన్ చేసి, పునఃకేటాయింపు లేదా పునఃవేలం ద్వారా ఈ రెండు బ్లాకులను సింగరేణికి కేటాయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎబికెఎంఎస్-బిఎంఎస్ నాయకులు కిషన్‌రెడ్డిని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# బిజెపి పాలనవస్తే గోల్డెన్ టెంపుల్‌గా చార్మినార్ భాగ్యలక్ష్మీమందిరం



సింహవాహిణికి పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (చాంద్రాయణగుట్ట), ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసి అంగరంగ వైభవంగా పండుగను నిర్వాహిస్తామని ప్రకటించారు. లాల్ దర్వాజా సింహవాహిణిని దర్శించుకున్న మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన వేదిక నుండి భక్తుల నుద్దేశించి ప్రసంగిస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

### లాల్‌దర్వాజాలో కేంద్రమంత్రి బండి సంజయ్

ఒక దశలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, బిఆర్ఎస్ పార్టీలే లక్ష్యంగా విమర్శలు చేశారు. లాల్‌దర్వాజా బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.5లక్షలు కేటాయించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రంజాన్‌కు రూ.33 కోట్లు ఇచ్చి, 80 శాతం ఉన్న హిందువులకు రూ.20 కోట్లు ఇవ్వటంపై మండి పడ్డారు. ఓవైసీ బాధపడతారని సింహవాహిణి ఆలయానికి నిధులు ఇవ్వటం లేదని ఆరోపించారు. జీహెచ్‌ఎంసి ఎన్నికల సమయంలో తాను భాగ్యలక్ష్మి మందిరాన్ని దర్శించుకుంటే కేటీఆర్ హేళన చేశారని, ఈరోజు జ్ఞానోదయమై అమ్మ వారిని దర్శించుకున్నారన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఉజ్జయిని, సింహ వాహిణి మహంకాళి దేవాలయాల అభివృద్ధికి రూ.20కోట్లు ఇస్తామని చెప్పిన అప్పటి సీఎం కేసీఆర్ దేవుళ్లను మోసం చేశారని ఎద్దేవా చేశారు.



# రాష్ట్రంలో తొలి కంటైనర్ బేస్డ్ అంగన్‌వాడీ కేంద్రం

## ఏజెన్సీలో భవన నిర్మాణాల అనుమతులకు నో

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా గిరిజన చట్టాలు అమలవుతున్న అటవీ ప్రాంత గ్రామాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు లేని కారణంగా ఆయా గిరిజన గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ఏర్పాట్లు ప్రభుత్వానికి పెద్ద సమస్యగా తయారయింది. ఈ సమస్యలకు పరిష్కార మార్గంగా కంటైనర్ బేస్డ్ అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పూరి గుడిసెల్లో సరైన మౌలిక వసతులు, సరైన మెటీరియల్ లేని పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కంటైనర్ ఆధారిత కేంద్రానికి రూపకల్పన జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే మొట్టమొదటి కంటైనర్ బేస్డ్ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు అయింది. ఈ కేంద్రం ద్వారా చిన్నారులకు ప్రీ స్కూల్ విద్య బోధించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో తొలి కంటైనర్ బేస్డ్ అంగన్వాడీ సెంటర్ ఇదే కావడం విశేషం. కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ అటవీ ప్రాంత గొత్తికోయ గ్రామం ధర్మన్న నగర్‌లో జిల్లాలోనే తొలిసారి కంటైనర్ బేస్డ్ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు అయ్యింది. ఈ కేంద్రం ఈ నెల 10వ తేదీ నుండి అందుబాటులోకి రానుంది. దాతల సహాయంతో 4 లక్షల రూపాయల వ్యయంతో కంటైనర్ బేస్డ్ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా స్థానికంగా ఉన్న చిన్నారులకు ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సంబంధిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. కంటైనర్ బేస్డ్ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. జిల్లాలో మారుమూల ఆదివాసి, గుత్తి కోయ గ్రామాలు అనేకం ఉన్నాయి. కనీస మౌలిక సదుపాయాలు, వసతులు కూడా లేని పరిస్థితుల్లో గుత్తి కోయలు ఉన్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా అభివృద్ధికి ఆమడ దూరంలో జీవనం సాగిస్తున్న వీరికి దాతలు సాయంతో ఇలాంటి సదుపాయాలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం అవుతోంది.

# అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

## గిరిజన సమాజం అభివృద్ధి చెందాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు9:** అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థా నానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదా యాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 'ఒక గిరిజన గ్రామా నికి రోడ్డు రావాలి.. ఒక ఇంటికి మంచినీరు అందాలి.. ఒక విద్యార్థికి మంచి విద్య లభించాలి.. ఒక యువకుడికి నైపుణ్యం రావాలి.. ఒక మహిళకు ఆదాయం సమకూరాలి.. ఒక రైతు భూమిలో పంట పండాలి. అప్పుడే బడ్జెట్‌కు నిజమైన అర్థం ఉంటుంది' అని మంత్రి పేర్కొన్నారు. సౌరశక్తి, సోలార్ పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉత్పా దకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన గురుకులాల్లోని 166 విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి తెలిపారు. 2025-26లో పదో తరగతిలో 98 శాతానికి పైగా, ఇంటర్మీడియట్‌లో 86 శాతానికి పైగా, డిగ్రీలో 89 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.28 మంది ఐఐటీల్లో, 23 మంది ఎన్‌ఐటీల్లో ప్రవేశాలు పొందగా, 167 మంది నీట్‌లో అర్హత సాధించడం గిరిజన విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆదివాసీ సమాజం, గిరిజన సంక్షేమం, విద్య, సంస్కృతి, హక్కుల పరిరక్షణ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.



# రష్యా నుంచి నేరుగా హిందూ మహాసముద్రానికి రైల్వేలైన్

## రష్యా ఉపప్రధాని ఖుస్నుల్లిన్ వెల్లడి

**మాస్కో, ఆగస్టు 9:** రష్యా నుంచి నేరుకగా హిందూ మహాసముద్రం వరకు రైల్వే మార్గాన్ని నిర్మించడం ద్వారా ఇండియాతో భూమార్గ అనుసంధానాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని మారత్ ఖుస్నుల్లిన్ ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చర్చించారు. హిందూ మహాసముద్రానికి రైల్వే మార్గాన్ని నిర్మించడాన్ని రష్యా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ రైలు నెట్‌వర్క్, ప్రస్తుతం ఉన్న సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని రష్యా విశ్వసిస్తోంది. ప్రస్తుతం రష్యా, భారత్ మధ్య అత్యధిక వాణిజ్యం బోస్పరస్, హార్ముజ్ జలసంధి వంటి కీలకమైన సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. హార్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ వాణిజ్య మార్గాలలో ఒకటి. అయితే ప్రపంచ చమురు రవాణాలో 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం ఈ సముద్ర మార్గం గుండానే జరుగుతాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా సముద్రం మార్గం ద్వారా వెళ్లే వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా తన వాణిజ్యం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఏఏ దేశాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది ప్రతిపాదిత రైల్వే నెట్వర్క్ రష్యా నుంచి బయలుదేరి మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలైన తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల గుండా హిందూ మహాసముద్రాన్ని చేరుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఇండియాకు రవాణా అయ్యే సరుకుల సమయం, వ్యయం గణనీయంగా తగ్గుతాయి. భూమార్గం, సముద్రమార్గాల కలయికతో కూడిన ఈ నెట్వర్క్ దక్షిణాసియా, మధ్య ఆసియా దేశాలకు సరికొత్త ఆర్థిక, వాణిజ్య అవకాశాలను అందిస్తుంది. భారతదేశం రష్యాకు ఓ ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి. ఇంధనం, రక్షణ, ఇతర రంగాలలో ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇండియాకు ప్రత్యక్ష, సురక్షితమైన భూమార్గ అనుసంధానాన్ని అభివృద్ధి చేయడం ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని మరింతగా పెంచగలదు. ఈ ప్రతిపాదన రష్యా, ఇండియాకు ముఖ్యమైనది మాత్రమే కాకుండా, మధ్య ఆసియా, ఇరాన్ వంటి దేశాలకు కూడా కొత్త వాణిజ్య అవకాశాలను అందించగలదు. భయంకపితులను చేసిన ఆ ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఘటనలో అసలు విషయాలు వెలుగులోకి ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు అవసరం. అటువంటి రైల్వే నెట్‌వర్క్‌ను నిర్మించడం సులభం కాదు. అనేక దేశాల గుండా వెళ్లే ఈ మార్గానికి గణనీయమైన పెట్టుబడి, భద్రతా చర్యలు, వివిధ దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారం అవసరం. రష్యా నిర్మాణ రంగం ఆర్థిక అవసరాల గురించి కూడా మారత్ ఖుస్నుల్లిన్ చర్చించారు. రష్యా నిర్మాణ పరిశ్రమకు ప్రతి సంవత్సరం సుమారు 1 ట్రిలియన్ రూబుల్స్ అదనపు పనిని నిర్వహించే సామర్థ్యం ఉందని, అయితే దీనికి రాబోయే ఐదేళ్లపాటు దీర్ఘకాలిక ఆర్థిక సహాయం అవసరమవుతుందని ఆయన పేర్కొన్నారు. అటువంటి నిధులతో రష్యా ఈ మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్మించగలదు.

# ఇంధన రంగంలో గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

## ప్రత్యేక ఆకర్షణగా పునరుత్పాదక ఇంధన మోడల్

### అమెరికాలో ఎనర్జీ క్లైమేట్ సెంటర్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు, తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని ఇండియా ఎనర్జీ క్లైమేట్ సెంటర్ (ఐఇసిసి) ను ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఇందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. 2030 నాటికి దేశం నిర్దేశించుకున్న 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చు లు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలిం చారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బ నైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం మరియు సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును ఆయన వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎంకుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్‌టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక మరియు వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్కీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని విక్రమార్క స్పష్టం చేశారు.

# కొత్త డిజైన్‌లో మహిళలకు ఉచిత చీరెలు

## నేతన్నలకు భారీ ఆర్డర్లు.. అక్టోబరులో పంపిణీకి సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు9:** మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళా సంఘాలకు అందించే చీరల ఉత్పత్తి వడివడిగా జరుగుతోంది. మేలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తుల ఆర్డర్లు ఇచ్చారు. కాగా ఇప్పటికే 1.74 కోట్ల మీటర్ల ఉత్పత్తి పూర్తయింది. గతంలో పంపిణీ చేసిన చేరలు నీలం రంగులో ఉండగా ఈసారి చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. ఈ సంవత్సరం పంపిణీ చేయనున్న చీరలకు ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. వాటిలో ఇటీవల రూ.142 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. టెస్కోలో నిధులు మంజూరు కాగానే చీరలను ఉత్పత్తి చేసే మ్యాక్స్‌సంఘాలకు డబ్బులు జమవుతాయి. గతంలో ఆర్డర్లు ఇచ్చిన 133 మ్యాక్స్ సంఘాల్లో 80 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని పూర్తిచేసిన 61 సంఘాలకు ఇటీవల రెండో విడత 1.62 కోట్ల మీటర్ల ఆర్డర్లు కేటాయించారు. ఉత్పత్తి పూర్తయిన వస్త్రాన్ని టెస్కో సేకరిస్తోంది. చీర,జాకెట్‌తో కలిపి 6.6 మీటర్ల మేర తయారు చేస్తున్నారు. ఒక్కోదానికి రూ.238 ఖర్చవుతోంది. ప్రింటింగ్, ప్రాసెసింగ్,రవాణాకు అదనంగా కేటాయించారు. సెప్టెంబర్ 20లోగా మొత్తం చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని పూర్తి చేయాలని గడువు విధించారు. వాటిని అక్టోబర్ నెలలో పంపిణీ చేసేలా అడుగులు వేస్తున్నారు. 2026–27 ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏక రూప దుస్తుల వస్త్రం విషయంలో నెలకొన్న సమస్యకు కూడా పరిష్కారం లభిస్తోంది. ఫిబ్రవరిలో సిరిసిల్ల జిల్లా పరిశ్రమకు 63 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చారు. ఉత్పత్తులు ప్రారంభించి రెండు నెలలు గడిచాక ఏప్రిల్‌లో ఉత్పత్తులు నిలిపివేయాలని ప్రభుత్వం టెస్కోకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కారణంగా నాలుగు నెలలుగా నేతన్నలు అయోమయానికి లోనయ్యారు. తాజాగా ఇప్పటికే తయారైన ఆ వస్త్రాలను సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. 2023 నవంబరులో సిరిసిల్ల జిల్లా పరిశ్రమలో సుమారు రూ.100 కోట్ల వస్త్రం సేకరించినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో రూ.42 కోట్ల విలువైన వస్త్రానికి లెక్కలు పూర్తయ్యాయి. ఇంకా పరిక్షించి లెక్కగట్టాల్సిన వస్త్రం విలువ సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా విడుదల చేసి ఉత్పత్తిదారులకు చెల్లింపులు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. తాజా చీరల ఆర్డర్లు,పెండింగ్ వస్త్రం సేకరణతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది. గత ప్రభుత్వ కాలంలో రేషన్‌కార్డులో ఉన్నవారికి ఒక చీర చొప్పున సరఫరా చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి అక్కా చెల్లెళ్లకు రేవంతన్న కానుక పేరుతో ఏడాదికి రెండు చేనేత చీరలను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆధార్‌కార్డులున్న ప్రతి మహిళకు చీరలను బతుకమ్మ కానుకగా ఇచ్చేవారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేస్తోంది.

# ఎంత నీరు! ఎంత జోరు!

## ప్రకాశం బ్యారేజీవద్ద నీటి ఉధృతిని పరిశీలించిన ఎపి సిఎం చంద్రబాబు

### పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 17 టిఎంసిల నీరు తరలింపు

**విజయవాడ,ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజ్‌లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్య మంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళుతున్న సమయంలో బ్యారేజ్‌పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్‌ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సిఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టిఎంసిల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సిఎం అన్నారు.

కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరిం చారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సిఎం అభిప్రాయ పడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేం దుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# ఆదివాసీల చరిత్రంతా పోరాటాలే



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సీతక్క

## కొమరం భీమ్ 'జల్, జంగిల్, జమీన్' పోరాటమే తెలంగాణ నినాదానికి మూలం

### పేటలో కొమరంభీమ్ విగ్రహావిష్కరణలో మంత్రి సీతక్క

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఆదివాసీల చరిత్ర అంతా చెట్టు, పుట్ట, వానలు, వరదలతో చేసిన పోరాటాల చరిత్ర అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు ఆదివారం జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు,

ఆదివాసీ జాతి గర్వకారణం అమర వీరుడు కొమరం భీమ్ స్ఫూర్తిని చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఆదివాసీ పోరాటయోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని ఆమె ఘనంగా ఆవిష్కరించారు. సీతక్క మాట్లాడుతూ కొమరం భీమ్ విగ్రహావిష్కరణ ప్రాముఖ్యతను తెలుసుకుని హైదరాబాద్‌లోని తన కార్యక్రమాలను పక్కనబెట్టి అశ్వారావుపేట విచ్చేసినట్లు తెలిపారు. కొమరం భీమ్ నినదించిన 'జల్, జంగిల్, జమీన్' పోరాటమే తెలంగాణమలిదశ ఉద్యమ 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదానికి ప్రధాన మూలమని స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ, రాంజీ గోండ్, కొమరం భీమ్ హక్కులు,ఆత్మగౌరవం కోసమే ప్రాణాలర్పించారని.. ఆదివాసీలు చేసిన ప్రాణత్యాగాలుఎక్కువైనా, వారికి దక్కిన ఫలితాలు తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు.

షెడ్యూల్డ్ హక్కుల అమలు: అంబేద్కర్, నెహ్రూ రాజ్యాంగంలో 5వ, 6వ షెడ్యూల్స్ ద్వారా ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కల్పించినా, అధికారులకుసరిగ్గా అవగాహన లేకపోవడం వల్ల హక్కులు సరిగ్గా అమలు కావడం లేదనిపేర్కొన్నారు. ద్వేషం లేని జాతి: ఆదివాసీలకు ఏ కులం, ఏ ప్రాంత ప్రజలతోనూశత్రుత్వం లేదని, గిరిజనేతరుడైన అల్లూరి సీతారామరాజు సైతం మన్యం బిడ్డలహక్కుల కోసం గొప్పగా పోరాడారని గుర్తుచేశారు.

**ప్రభుత్వ సంక్షేమం ప్రజా పాలన**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పేదలు, అడవి బిడ్డలంటే ప్రత్యేక అభిమానమని చెబుతూ, అశ్వారావుపేట నియోజకవర్గానికి ఇప్పటివరకు రూ.1,200 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని వెల్లడించారు. సూటు బూటు వేసుకున్న వారికైనా, చదువురాని పేదవానికైనా ఒకే ఓటు హక్కు, సమాన గౌరవం ఉన్నాయని ఏజెన్సీ అధికారులు పేదలు వస్తే దూరం నెట్టకుండా ఆదరించాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్, ఆరఅండ్‌బి నిధులతో అశ్వారావుపేటలో స్కిల్ డెవలప్‌మెంట్‌భవనాన్ని శాంక్షన్ చేయిస్తామని, ఏజెన్సీ ప్రాంతాలకు ప్రజా ప్రభుత్వం అదనంగా ఇళ్లను కేటాయిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ఆరుగురు ఆదివాసీ ఎమ్మెల్యేలు ఐక్యంగా ఉంటూ మంత్రులు పొంగులేటి, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు. కొండా సురేఖలతో కలిసి పోడు భూములు, స్థానిక ఉద్యోగాల సాధనకు కృషి చేస్తున్నామని వివరించారు.

**సంస్కృతిని మరువొద్దు**

మంత్రి పదవులు వచ్చినా ఆదివాసీ భాష, వేషధారణ, గోత్రం మరువకూడదని, పరిణామాల వల్ల వరంగల్, ములుగు ప్రాంతాల్లో ఆదివాసీలు మాతృభాషను కోల్పోయారని తన అమ్మమ్మ మాటలను గుర్తుచేసుకున్నారు. నాయకులు, అధికారులు మారినా ఆదివాసీ జాతి నిరంతర ప్రవాహమని, భవిష్యత్తు తరాలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి మన భాష, సంస్కృతి, సాంప్రదాయాలు మాత్రమేనని పిలుపునిచ్చారు. కాగా, ఢిల్లీ తరహాలోనే అశ్వారావుపేటలో కూడా ఒక ప్రత్యేక 'ట్రైబల్ మ్యూజియం' ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, డిఆర్‌డిఓ విద్యా చందన, జెడ్పీ సిఇఓ నాగలక్ష్మి ్మ, మాజీ ఎమ్మెల్యేలు, ఆదివాసీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# 13 నుంచి 15 దాకా ప్రతి ఇంటిపై జాతీయ జెండా

## వికసిత్ భారత్ స్ఫూర్తి ప్రతిబింబించాలి: ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆగస్టు 15 నుంచి పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటింటా జాతీయ జెండా, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి నింపాలని సిఎం పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సిఎం స్పష్టం చేశారు. 'మై నేషన్‌నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి ఇంటికీ చేరాలని ఆకాంక్షించారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలన్నారు. వికసిత్ భారత్‌స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛంధ సేవా స్ఫూర్తిని పునరుద్ధరించాలని చంద్రబాబు నొక్కి చెప్పారు.

# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

- నిరసన కార్యక్రమాల్లో కనిపించని నిరుద్యోగులు
- ఆరోపణలు, కోర్టు కేసులు, ప్రభుత్వ వివరణల మధ్య కొనసాగుతున్న వివాదం
- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లపై హైకోర్టు విచారణకు ఆదేశం
- పేపర్ లీక్ ఆరోపణలను ఖండించిన ఎపి ప్రభుత్వం

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డిఎస్సీ– 2025 నియామక ప్రక్రియపై వివాదంకొనసాగుతోంది. డిఎస్సీ నియా మకాల్లో అక్రమాలు, మెరిట్ జాబితాలో అవకతవకలు, రిజర్వేషన్ అమలులో లోపాలు, స్పోర్ట్స్ కోటాకింద నకిలీ ధ్రువపత్రాల వినియోగం, ప్రశ్నపత్రం లీక్‌వంటి పలుఆరోపణలు రాజకీయంగానూ, న్యాయపరం గానూ చర్చకు వచ్చాయి. అయితే వీటిలో ప్రతి ఆరోపణ నిజమని ఇప్పటివరకు న్యాయస్థానం తుది నిర్ధారణ చేయలేదు. అదే సమయంలో వివాదాలకు సంబంధించి పలు కేసులు కోర్టుల ముందుకు వెళ్లడం మాత్రం వాస్తవం.

**335కు పైగా పిటిషన్లు.. అభ్యర్థుల అసంతృప్తి**

మెగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి వివిధ అంశాలపై అభ్యర్థులు పెద్ద సంఖ్యలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు విచా రణలో 335 పిటిషన్లు దాఖలైనట్లు ప్రస్తావన వచ్చింది. వ్యక్తిగతంగా నష్టపోయామని భావిస్తున్న అభ్యర్థులు నేరుగా న్యాయపరమైన పరి ష్కారం కోరుతున్న నేపథ్యంలో, మొత్తం డిఎస్సీ ప్రక్రియను ఒకే మాటతో అక్రమమనితేల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవు తోంది. డిఎస్సీలో కొంతమంది అభ్యర్థులు తమకు ఎక్కువ మార్కులు వచ్చినప్పటికీ తక్కువ మార్కులు సాధించిన వారికి అవకాశం లభించిందని, ప్రాధాన్యతలు, రిజర్వేషన్ అమలుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని, నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల అమలును సమర్థిస్తోంది. హైకోర్టులో దాఖలైన కేసుల్లో కూడా అభ్యర్థుల ఎంపిక, నియామకం, రోస్టర్, ప్రాధాన్యతల అమలుకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలనకు వచ్చాయి. కోర్టు ఇప్పటికే వ్యక్తిగత అభ్యంతరాలను పరిశీలించేందుకు గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం వంటి చర్యలకు ఆదేశాలు ఇచ్చింది.

**కీలకంగా మారిన స్పోర్ట్స్ కోటా**

డిఎస్సీ వివాదంలో ప్రస్తుతం అత్యంత కీలకంగామారిన అంశాల్లో స్పోర్ట్స్ కోటాఒకటి. మెగా డిఎస్సీ– 2025లో మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌కోసం 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు ప్రత్యేక ప్రక్రియ చేపట్టారు. ఈ కోటాలో నకిలీ లేదా అనుమానాస్పద క్రీడా ధ్రువపత్రాలను ఉపయోగించి ఉద్యోగాలు లేదా ఇతర ప్రయోజనాలు పొందారనే ఆరోపణలు తెరపైకివచ్చాయి. ఈ వ్యవ హారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జులై 2026లో విచారణకు ఆదేశిస్తూ, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆరోపణలపై ప్రభుత్వం దర్యాప్తు చేసి నాలుగు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ముఖ్యంగా జూడో విభాగానికి సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు ప్రస్తావనకు వచ్చాయి.

**పేపర్ లీక్ జరిగిందా?**

ఇదిలా ఉండగా విద్యాశాఖలో ఉన్న కొందరు ఉన్నతాధికారుల ద్వారా డిఎస్సీ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీక్, డేటా మానిప్యులేషన్ జరిగిందని ప్రతిపక్షాలు, కొందరు అభ్యర్థులు ఆరోపించారు. కొందరు దీనిపై సిబిఐ విచారణకు కూడా డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో, భద్రతా ప్రమాణాలతో నిర్వహించామని, ప్రశ్నపత్రం లీక్ లేదా డేటా మానిప్యులేషన్‌కు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈక్రమంలో పేపర్ లీక్ ఆరోపణ గానే మిగిలిపోయింది. దానికి సంబంధించి ఆధారాలు కోసం దర్యాప్తు కొనసాగుతోంది. రాష్ట్రమంతా వైసిపి నేతలు డిఎస్సీ అక్రమాలు అంటూ నిరసన కార్యక్రమాలు జోరుగా సాగుతున్న సమయంలో మరి అసలు నిజం ఏమిటనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# ఆదిలాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

## ఆదివాసీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఆదిలాబాద్ ఎంపి గోడం నాగేష్



**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎంఆర్సీలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**కొమురం భీమ్‌కు ఘననివాళి**

కార్యక్రమానికి ముందు కేబీ కాంప్లెక్స్ ఆవరణలో కొమురం భీం విగ్రహాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరి జన సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయ నృత్యాల్లో పాల్గొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

**గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ కొమురం భీమ్, రాంజీ గోండ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తికి అనుగుణంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీవీటీజీ నివాస ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద వేలాది ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేశామని, ఇందుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు.

**యువత సంక్షేమానికి చర్యలు: ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు, ఆదివాసీ ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలపడ్డాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రంథాలయాలు, శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత డ్రైవింగ్ లైసెన్సులు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో ఉట్నూర్‌లో ఉపాధి మేళా నిర్వహించడంతో పాటు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.గంజాయి సాగు, విక్రయాలు చట్టరీత్యా తీవ్ర నేరమని, యువత అటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి**

ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ ఆదివాసీ జీవన విధానం ప్రకృతి ఆరాధన, సంప్రదాయ వైద్య పరిజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ వారి సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే వెద్మ బొజ్జు మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణకు శాంతియుత, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పోరాటం చేయాలని సూచించారు. జీవో 3, జీవో 49, పోడు భూములు, పెసా, అటవీ హక్కుల చట్టాల అమలుపై సమీక్ష అవసరమన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ గతంలో అమలు చేసిన కొన్ని అటవీ చట్టాలు, టైగర్ రిజర్వ్ ఆంక్షల కారణంగా గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎస్పీ రిత్విక్, వివిధ శాఖల అధికారులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

